

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

గురువారం 31 ఆగస్టు 2023 పేజీలు : 04


# కరోనా కన్నా కరువు ప్రమాదం

- తక్షణం ఉమ్మడి అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త సహదేవరెడ్డి

**అనంతపురం ఓల్డ్‌టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

కరోనా కన్నా కరువు ప్రమాదకరమని అనంతపురం ఉమ్మడి జిల్లాలో పూర్తి స్థాయి వర్షాభావ పరిస్థితి నెలకొన్న దృష్ట్యా ఉమ్మడి అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కరువు నివారణకు ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశంలో అన్ని పార్టీల నాయకులు, రైతు సంఘాల నాయకులు, మేధావులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, కరువును జయించే ప్రణాళికలపై రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో కొద్ది మొత్తం సాగుచేసిన వేరుశనగ, ఆముదం పంటను రక్షించుకునే చర్యలపై చర్చించారు. గతంలో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులు మళ్లీ దాపురించాయని వాటిని ఎలా ఎదుర్కోవాలో విభిన్న ప్రణాళికలు రచించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. పంటకు నీరు అందించే ప్రణాళికు చేపట్టాలన్నారు. ఎలినినో ప్రభావంతో దక్షిణ భారతదేశంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన కారణంగా అనంతపురం జిల్లాలో కూడా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, జిల్లాలో



రైతుల సమస్యలను వివరిస్తున్న మహిళా రైతు గంగమ్మ

84 శాతం లోటు వర్షపాతం నమోదైందన్నారు. సీనియర్ శాస్త్రవేత్త సహదేవరెడ్డి మాట్లాడుతూ జిల్లా రైతులకు వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తున్నామని వేరుశనగ పంటను తగ్గించి చిరుధాన్యాలను సాగుచేయాలని సూచించామని అయినప్పటికి చాలా మంది రైతులు వేరుశనగ వైపే వెళుతున్నారన్నారు. వాతావరణ పరిస్థితులను మరింత క్షుణ్ణంగా అధ్యయనం చేయడానికి డ్రాఫ్టర్ రాడర్‌ను జిల్లాలో ఏర్పాటు చేయగలిగితే ఖచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించగలిగేందుకు అవకాశం వుంటుందన్నారు. ఉరవకొండ ప్రాంతానికి చెందిన మహిళా రైతు గంగమ్మ మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా తాము సాగుచేసిన పంట పూర్తిగా నష్టపోయామని ప్రభుత్వాలు కనీసం ఇప్పటికైనా రైతులను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పశువుల మేతకు సైతం ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం రక్షక తడుల వైపు కానీ రెయిన్‌గన్‌ల గురించి కానీ ఆలోచించడం లేదని ఆవేదన వ్య క్తం చేశారు. ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ ద్వారా జిల్లాలోని ఐదు మండలాలను పైలెట్ ప్రాజెక్ట్ కిందకు తీసుకుని దాదాపు 6 ఎకరాల పంట కాపాడగలిగామని ఏఎఫ్ఏ కళాశాల సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి గేయానంద్, సిపిఎం నాయకుల రాంభూపాల్, రామిరెడ్డి, టిడిపి నాయకులు సరిపూటి రమణ, బిజెపి నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, వీరభద్రారెడ్డి, సురేంద్రారెడ్డి, జనవిజ్ఞానవేదిక డాక్టర్ ప్రసూన, రిటైర్డ్ తహశీల్దార్ శిలా జయరామప్ప, తదితరులు పాల్గొన్నారు.

# నీటి ప్రాజెక్టుని గాలికి వదిలేసిన ప్రజా ప్రతినిధులు

- తాగునీటి ప్రాజెక్టు పూర్తి కానందునే గుత్తిలో నీటి సమస్య
- కాంట్రాక్టర్ల ఆదాయం కోసం ట్యాంకర్ల ద్వారా 20 రోజులకు ఒక్కసారి గుత్తి ప్రజలకు నీటి సరఫరా
- తాగునీటి కోసం 173 కోట్ల ప్రాజెక్టు ఏర్పాటు చేసిన నారా చంద్రబాబునాయుడు
- టిడిపి సీనియర్ నేత పెరుమాళ్ల జీవానందరెడ్డి





టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న పెరుమాళ్ల జీవానందరెడ్డి

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త బ్యూరో**

తెలుగుదేశం పార్టీ హయాంలో తాగునీటి కోసం 173 కోట్ల రూపాయల ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ప్రభుత్వం చేపట్టిన వైఎస్ఆర్‌సిపి నాలుగు సంవత్సరాలు అవుతున్నా తాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదని గుంతకల్లు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. గుత్తి పట్టం, గుత్తఅనంతపురం రోడ్డులో తెలుగుదేశం పార్టీ హయాంలో తాగునీటి కోసం 173 కోట్ల ఏర్పాటు చేసిన ప్రాజెక్టును బుధవారం పెరుమాళ్ల జీవానందరెడ్డి సందర్శించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గుత్తి ప్రజలకు తాగునీటి సమస్య ఉండకూడదని ముందు చూపుతో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు తెదేపా హయాంలో పెనకచర్ల డ్యాం నుంచి గుత్తి పట్టణం వరకు నీటి కోసం 173 కోట్ల రూపాయలు ఏర్పాటు చేసి ప్రాజెక్టు ప్రారంభించారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాడినప్పటి నుంచి తాగునీటి ప్రాజెక్టును ఇంత వరకు పూర్తి చేయలేదన్నారు. తాగునీటి ప్రాజెక్టు పూర్తి కానందునే గుత్తి పట్టణంలో నీటి సమస్య ఎక్కువైందన్నారు. గుత్తిప్రజలు చేసిన పాపమేమని ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టుకు ఎందుకు పూర్తి చేయలేదన్నారు. గుత్త పట్టణ ప్రజలకు ట్యాంకర్ల ద్వారా 20 రోజులకు ఒకసారి నీటిని సరఫరా చేయడం వల్ల ఆ నీటిలో పురుగులు పడిన నీరునే వాడుకుంటున్నా రన్నారు. కాంట్రాక్టర్ల ఆదాయం కోసం ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారన్నారు. 151 శాసనసభ్యులుగా ఎన్నుకున్నందుకు 173 కోట్ల నీటిప్రాజెక్టును నీరు కార్చారన్నారు. ప్రాజెక్టుల నిధులు మళ్లింపు కరువు పని నిధుల మళ్లింపు గ్రామ పంచాయితీ నిధుల మళ్లింపు ఒక సీఎం జగన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఉన్న రాజధాని, కట్టలేదు, కట్టిన టిడ్కో ఇళ్లను పేదలకు పంచిపెట్టలేదు. ఇక్కడ తాగునీటి ప్రాజెక్టును పూర్తి చేయలేదు కేవలం నారా చంద్రబాబునాయుడుకి మంచి పేరు వస్తుందని రాజధాని టిడ్కో ఇల్లు నీటి ప్రాజెక్టు గాలికి వదిలేశారన్నారు. ప్రజా ప్రతినిధుల మాటలు విని నిధుల మళ్లింపుకు సహకరించిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. తాగునీటి సమస్య ఉందని మున్సిపల్ అధికారులను గుత్తి ప్రజలు అడిగితే ప్రొటెక్షన్ పేరుతో పోలీసులను ఆశ్రమించడమేంటన్నారు. నా ప్రజల కోసం తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే తాగునీటి సమస్య శాశ్వితంగా పరిష్కరిస్తా మన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పిజెఆర్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# డీజిల్ బిల్లులు లక్షల్లో డ్రా




- కాంట్రాక్టర్లకు వరంగా మారిన జెసిబి, మినీ జెసిబిలు
- కౌన్సిలర్లు అడిగితే కుంటి సాకులతో కాలయాపన
- స్టేషనరీ కొనుగోలులో లక్షల్లో అవినీతి
- ఉన్నత శాఖ అధికారులు విచారణ చేపట్టాలి

**కదిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త**

*అక్కడ సిబ్బంది డీజిల్‌ను మంచినీళ్లలా గుటగుట మింగేస్తున్నారు. కొనుగోలు వినియోగంలో అంతా వ్యత్యాసం కనబడుతోంది. పర్యవేక్షణ కొరవడటం, అడిగేవారు లేకపోవడంతో ఇష్టారాజ్యాంగా మారింది. మున్సిపాలిటీలకు నిధులు విడుదల అంతంత మాత్రమే ఉండటంతో వార్డుల్లో అభివృద్ధి పడకేసింది. అరకొర నిధులను కూడా కొందరు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు, కదిరి మున్సిపాలిటీలో డీజిల్ కొనుగోలులో మాయాజాలం నడుస్తోంది.*

కాకి లెక్కలతో పెద్ద మొత్తంలో బిల్లులు డ్రా చేసినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. లాక్‌బుక్, రిజిస్ట్రర్‌లోని వివరాలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. స్టేషనరీ కొనుగోలులో సైతం లక్షల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కదిరి మున్సిపాలిటీ పరిధిలో నిధులు తిన్నోడు బుద్ది మంతుడు అన్న చందంగా తయారైంది. వాహన డీజిల్ కొనుగోలులో భారీగా అవినీతి జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొన్ని కార్యకలాపాలలో సైతం అవినీతి జరిగినట్లు సమాచారం. ఉన్నతాధికారులు విచారిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని పలువురు తెలుపుతున్నారు.

**డీజిల్ బిల్లులు లక్షల్లో డ్రా**

డీజిల్ బిల్లుల విషయంలో కాకి లెక్కలు చూపుతూ లక్షల్లో బిల్లులు డ్రా చేసినట్లు సమాచారం వినిపిస్తోంది. మున్సిపాలిటీలో కమిషనర్, ప్రజా ప్రతినిధికి ప్రభుత్వ వాహనం కలదు. శానిటేషన్ శాఖ పరిధిలో 4 ట్రాక్టర్లు, మినీ కంపెంటర్స్ రెండు, పెద్ద కంపెంటర్స్ ఒకటి, జెసిబి ఒకటి, మినీ జెసిబి, బొలెరో వాహనం ఒకటి ఉన్నాయి. మున్సిపాలిటీలో ప్రజా అవసరాల పనులు చేయకుండా ఆ శాఖ సిబ ్బంది వాహనాలు వినియోగించడంలో పూర్తి స్థాయిలో వైఫల్యం చెందారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం మూడు వాహనాలకు సంబంధించిన డీజిల్‌లో పెద్ద అవినీతి జరిగినట్లు వినిపిస్తోంది. జేసిబి మినీ జేసిబి, బొలెరో వాహనాకలు సంబంధించి డీజిల్ పేరుతో లక్షల్లో బిల్లులు డ్రా చేసినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ మూడు వాహనాలకు సంబంధించి గత ఏడాది జనవరిలో 1,06,883 రూపాయలు, నవంబర్‌లో 1,69,535 రూపాయలు, ఈ ఏడాది మే నెలలో జెసిబి, మినీ జెసిబి వాహనాల డీజిల్‌కు మాత్రమే 70,961 రూపాయలు డ్రా చేశారు. వాస్తవ మొత్తం కంటే ఎక్కువ మొత్తంలో నిధులు డ్రా చేశారన్న ఆరోపణలు లేకపోలేదు. ట్రాక్టర్లు, కంపెంటర్స్, మినీ కంపెంటర్స్, అధికారులు, ప్రజా ప్రతినిధుల వాహనాలకు ఇంకెంత స్థాయిలో డీజిల్ పేరుతో బిల్లులు డ్రా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి.

**కాంట్రాక్టర్లకు వరంగా మారిన జెసిబి, మినీ జేసిబి :**

కాంట్రాక్టర్లకు మున్సిపాలిటీకి చెందిన జెసిబి, మిని జెసిబి వాహనాలు వరంగా మారినట్లు సమాచారం. తమకున్న పలుకుబడితో కాంట్రాక్టర్లకు చెందిన పనులకు మున్సిపల్ వాహనాలను వినియోగించుకుంటున్న సంబధిత శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు అటువైపు కన్నెత్తి చూడక పోవడంతో మున్సిపాలిటీకి సంబంధించిన సొంత వాహనాలను పనులకు వినియోగించుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. వార్డుల్లో నెలకొన్న సమస్యలు ఉన్నప్పుడు వాహనాలు అడిగితే తప్పించుకునే అధికారులు కాంట్రాక్టర్లు అడిగితే వాహనాలను పంపించేస్తున్నారని కొంత మంది కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల మున్సిపల్‌చైర్‌పర్సన్ నజిమున్నీసా శానిటేషన్ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వార్డుల్లో నెలకొన్న సమస్యలపై మాత్రమే వాహనాలను వినియోగించాలని లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించినట్లు సమాచారం.

**లాక్‌బుక్ నిర్వహణ.. లోప భూయిష్టం :**

డీజిల్ వినియోగానికి సంబంధించి ఏఏ వాహనం ఎక్కడెక్కడ తిరిగింది. ఎన్ని కిలోమీటర్లు తిరిగింది. ఆ వాహనానికి కొట్టించిన డీజిల్ ఎంత తదితర వివరాలను లాక్ బుక్కులో పొందు పర్చాలి. ప్రతిరోజు ఇది జరగాలి. అయితే లాక్ బుక్ నిర్వహణ లోపాభూఇష్టంగా ఉందని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.

**స్టేషనరీ కొనుగోలులో లక్షల్లో అవినీతి :**

మున్సిపాలిటీ కార్యాలయంలో స్టేషనరీ కొనుగోలులో లక్షల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పర్యవేక్షణ కరువవడంతో కొంత మంది సిబ్బంది ఇష్టాను సారంగా అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతస్థాయి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయంపై డిఈని వివరణ కోరగా మున్సిపాలిటీలో జరుగుతున్న పనులకు మాత్రమే వాహనాలు వినియోగిస్తున్నామని, కాంట్రాక్టర్ల పనులకు వాహనాలు వినియోగించినట్లు తమ దృష్టికి వస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

# పోలీస్ శాఖలో కొత్త ఒరవడికి నాంది

-దోషులకు శిక్షపడేలా చర్యలు -డిఐజి ఆర్.ఎన్.అమ్మిరెడ్డి







న్యాయవాదిని సన్మానిస్తున్న డిఐజి, ఎస్‌పి తదితరులు, జిల్లా సమీక్షలో పాల్గొన్న పోలీస్ అధికారులు, ఎస్‌పి మాధవ రెడ్డిని అభినందిస్తున్న డిఐజి అమ్మిడిరెడ్డి

**పుట్టపర్తి, ఆగస్టు 30, ప్రభాతవార్త**

పోలీస్ శాఖ పనితీరులో కొత్త ఒరవడికి నాంది పలుకుతున్నట్లు అనంతపురం రేంజ్ డిఐజి ఆర్.ఎన్.అమ్మిరెడ్డి పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి సాయి ఆరామంలో ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా పోలీస్ సమీక్షలో పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తీవ్రమైన నేరాలు ముద్దాయిలకు కఠిన శిక్షలు పడేలా పోలీస చర్యలు అన్ని రకాల ఆధారాలు సేకరించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వంటి సమూల మార్పులను తీసుకురావడం జరుగుతుందన్నారు. ఎస్ఐ నుండి జిల్లా ఎస్‌పి వరకు ప్రతి ఒక్కరూ అందుకోసం పని చేయడం జరుగుతోందన్నారు. కోర్టుల్లో కేసులు వీగిపోకుండా నేరస్తులకు తప్పక శిక్షపడేలా సమగ్ర విచారణ చేసి ఆధారాలను కోర్టుకు అందజేయడం జరుగుతుందన్నారు. దీని కోసం పోలీసు తరఫున న్యాయవాదులు, కోర్టు పోలీస్ సిబ్బంది పనితీరు బాగుందన్నారు. ఇటీవల గోరంట్ల, కదిరి ప్రాంతాల్లో జరిగిన రెండు సంఘటనలకు సంబంధించి జీవిత ఖైదు, 20 యేళ్ళ జైలు శిక్ష దోషులకు పడడం శుభపరిణామమన్నారు. ఇందు కోసం కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ విద్యాపతిని డిఐజి అభినందించారు. శ్రీసత్యసాయి జిల్లా వ్యాప్తంగా 496 కేసులు విచారణలో ఉన్నాయని, మహిళల్లో విశ్వాసం పెంచేలా ఫ్రెండ్లీ పోలీస్ ద్వారా ప్రజా సేవలో పోలీస్ అన్న నమ్మకాన్ని పెంచుతున్నామన్నారు. ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న కేసుల యుఐ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటిని వీలైనంతగా తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు హైవే అథారిటీ వారితో సమన్వయం చేసుకొని ముందుకు వెళ్ళాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. పోలీసులు విధుల్లో పారదర్శకంగా ఉండి ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలని, చిన్నారులపై అఘాయిత్యాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టడం, రౌడీషీటర్లు, గంజాయి, మట్కా, ఎర్రచందనం ఫొక్సో వంటి కేసుల ప్రొసీజర్ ల్యాప్స్ లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీస్ సిబ్బందికి, సెబ్ సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పి ఎన్.విష్ణు, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు, లీగర్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, పిపిఎల్ సిబ్బంది పాల్గొన్నారు.

**ఎస్‌పి చొరవపై డిఐజి ప్రశంస**

శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి ఎస్.వి.మాధవ రెడ్డి అంకితభావం, సేవా భావంతో విధులు నిర్వహిస్తుండడం పట్ల ఆయనను డిఐజి అమ్మిరెడ్డి ప్రశంసించారు. ఇటీవల చిన్నారి స్రవంతికి వ్యక్తిగత సాయం అందించి, ప్రమాదంలో కన్ను కోల్పోయిన పోలీస్ రణధీర్‌కు 10 లక్షల ప్రభుత్వ సహాయం అందేందుకు విశేషంగా కృషి చేసిన ఎస్‌పిని ప్రత్యేకంగా అభినందించారు. ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమానికి ఇది ఒక ఆదర్శవంతమైన ఉదాహరణ అన్నారు. ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకాన్ని సఖ్యతను పెంచి పోలీస్ సేవ భావానికి నిదర్శనంగా అభివర్ణించారు.

# పల్లె ఉమాకు ఘన నివాళి





పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, కుటుంబ సభ్యులు, ప్రభాకరచౌదరి





నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి, వర్ధంతి సందర్భంగా రక్తదానం చేస్తున్న దృశ్యం

**అనంతపురం, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి**

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమా ఐదోవ వర్ధంతి వేడుకలు మంగళవారం అనంతపురంలోని పల్లె ఉమా ఘాట్ వద్ద ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, కుమారుడు, శ్రీ బాలాజీ విద్యా సంస్థల ఛైర్మన్ పల్లె కిషోర్, కోడలు పల్లె సింధూర, కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులతో పాటు వేలాది మంది పల్లె ఉమాకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ పల్లె ఉమా తన జీవితంలోకి రావటం తన అదృష్టమని అన్నారు. తన విజయం వెనుక పల్లె ఉమా ఉందని, తను భౌతికంగా లేకనప్పటికీ తనలో ఉందన్నారు. ఆమె అనంతపురం జిల్లాలో ఎంతో మంది పేద విద్యార్థులకు విద్య అందించిన విద్యా దాత అన్నారు. ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్‌చౌదరి, హనుమంతరాయచౌదరి, ఈరన్న, టిడిపిఎస్‌సి సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.ఎస్.రాజు, రాష్ట్ర కార్యదర్శి గడ్డం సుబ్రమణ్యం, టిడిపి నాయకులు ఎల్.నారాయణచౌదరి, అంబికలక్ష్మి నారాయణ, గాండ్ల విశాలాక్షి, సిపిఐ నాయకులు వేమయ్యయాదవ్, జాఫర్, ఎస్కేయూ ఉప కులపతి మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. శ్రీ బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో పివికెకెఐటి, కృష్ణదేవరాయల వ్యవసాయ, ఉద్యానవన కళాశాలలు, డిగ్రీ, పీజీ అన్ని కళాశాలల్లో జిల్లా వ్యాప్తంగా ఆస్పత్రుల్లో బ్రెడ్లు, పండ్లు, అన్నదానాలు, రక్తదానాలు, వృద్ధాశ్రమాల్లో నిత్యావసర సరుకుల పంపిణీ లాంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి సింధూరరెడ్డి, కేరళ మాజీ డిజిపి శంకర్‌రెడ్డి, యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి, పివికెకె ఐటి డీన్ డాక్టరు సంతోష్‌కుమార్‌రెడ్డి, బాలాజీ ఎంబిఎ కళాశాల ప్రిన్సిపాళ్లు డాక్టరు సుబ్బారావు, డాక్టరు మన్మధేశ్వరరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరిటాల రవి జయంతి కార్యక్రమం

- వెంకటాపురంలోని ఘాట్ వద్ద ఘనంగా నివాళులు అర్పించిన కుటుంబ సభ్యులు



నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త బ్యూరో**

దివంగత నేత మాజీ మంత్రి పరిటాల రవీంద్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్రవేశారని మాజీ మంత్రి పరిటాల సునీత, శ్రీరామ్ అన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలోని

మిగతా 4లో..

# హెచ్‌ఎల్‌సికి తరచూ గండి

- ఆందోళనలో ఆయకట్టు రైతులు



నీరు లేక వెలవెలబోతున్న హెచ్‌ఎల్‌సి కాలువ



గండి పడిన దృశ్యం (ఫైల్‌ఫోటో)

**బొమ్మనహాళ్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

మండల పరిధిలోని హెచ్‌ఎల్‌సి ప్రధాన కాలువకు ఆంధ్ర-కర్ణాటకలో తరచూ గండ్లు పడటం వల్ల తుంగభద్ర జలాశయంలో కాలువలకు పూర్తిగా నీటి మట్టం తగ్గించడంపై స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..

మిగతా 4లో..

# సంఘీభావ యాత్రను విజయవంతం చేయండి - మాజీమంత్రి పల్లె

**కొత్తచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర నేటికి 2000 కిలోమీటర్లు పూర్తయిన సందర్భగా లోకేస్ పాదయాత్రకు సంఘీభావంగా గురువారం మధ్యాహ్నం 02:00 గంటలకు కప్పల బండ నుండి మామిళ్ళకుంట క్రాస్ వరకు సంఘీభావ యాత్రను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. కొత్తచెరువు మండల తెదేపా నాయకులు కార్యకర్తలు, మహిళలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున ఇందులో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పుట్టపర్తి తెదేపా కార్యాలయం కార్యాలయంలో కొత్తచెరువు మండలంలో 38 బూత్ కన్వీనర్లు, గురువారం ఉదయం 11 గంటలకు బూత్ కమిటీ మెంబర్లతో సమావేశం నిర్వహించబడుతుందని, ఈ మీటింగ్‌కు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని తెలిపారు.

# సిసిరోడ్లు వేయిస్తున్న అధికారులు


సిసి రోడ్డు వేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం ఆగస్టు 30 ప్రభాతవార్త, : మండలంలోని పోలేపల్లిలో గడపగడప కార్య క్రమంద్వారా పంచాయితీకి20లక్షలనిధులను మంజూరు చేసిన ప్రభుత్వం గడప గడపకు వైసీపి కార్యక్రమంలో మంజూరైన సీసి రోడ్లను పోలేపల్లి,పడమటి కోడిపల్లి గ్రామ పంచాయితీలో మంజూరైన సీసి రోడ్లను పిఆర్‌జేయి విజయక్రిష్ణ దగ్గరుండి సీసి రోడ్లను వేయిస్తున్నారు.సర్పంచ్ శెట్టిగారి మంజునాథ,మమత అధ్వర్యంలో సీసి రోడ్లను వేయిస్తున్నారు.

# మెగా రక్తదాన శిభిరంను విజయవంతం చేయండి

**బ్రహ్మసముద్రం ఆగస్టు 30 ప్రభాతవార్త :** సెప్టెంబర్ 05న మండల కేంద్రంలో జరుగు మెఘా రక్తదాన శిభిరంను విజయవంతం చేయాలని దుర్గం రక్తదాతలు అధ్వర్యంలో జరుగు కార్యక్రమంకు మండల స్థాయి అధికారులు.తహశీల్దార్, ఎంపిడీఓ,ఎంఈఓలకు దుర్గం రక్తదాత సభ్యాడు చన్నమల్లప్ప అధికారులను అహ్వానించారు.ఈ కార్యక్రమంకు వారిసహకారం అందించి కార్యక్రమంను విజయవంతం చేయవాల్సిందిగా కోరారు.

# మహిళా సంఘాల సభ్యులకు మరింత ప్రోత్సాహకం అందిస్తాం-మేనేజర్ మహేష్


సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్

**బ్రహ్మనముద్రం ఆగస్టు 30 ప్రభాత వార్త, :** మండలంలోని వేపులపర్తిలో వున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేష్ వెలుగు సీసీలు,అనిమేటర్‌తో బ్యాంక్‌లో సమావేశం నిర్వహించి మహిళా సంఘాల గ్రూప్ సభ్యూలకు మరింత ప్రోత్సాహకాలు అందించి మహిళల జీవనోపాది పొందేలా అవసరమైన లోన్‌లను అందిస్తామని అన్నారు.గ్రూప్ సభ్యూల్లో ఎవరైనా ఒక్కరు లోన్‌చెల్లించకపోతే వారికి లోన్ కట్టడంవల్ల సభ్యూలకు కలిగే ప్రయోజనాలు తెలియజేసి లోన్ రెగ్యులర్ చేయించాలని అన్నారు.అనంతరం ఫీల్డ్ ఆఫీసర్ మధుసూదన్‌రావు మాట్లాడుతూ మహిళా సంఘాలు రెగ్యూలర్‌గా లోన్ చెల్లించే వారిసంఘాలను గుర్తించి వారిజీవనోపాదికి అవసరమైన లోన్‌లు 20 లక్షలనుండి 30 లక్షల వరకు అందిస్తామని అన్నారు లోన్ అవసరమైన సంఘాలను ముందుగా గుర్తించి వారివివరాలు అందిస్తే లోన్ అందిస్తామని అన్నారు.ప్రతి గురు,శుక్రవారాలు ప్రత్యేకంగా మహిళా సంఘాల కోసం కేటాయిస్తామని అన్నారు.

# సజావుగా మండల సర్వసభ్య సమావేశం


మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**కంబదూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండల కేంద్రం లోని ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం ఎంపి డిఓ సుధాకర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సజావుగా సాగింది. ఈ సమావేశానికి అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ప్రధానంగా హౌసింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్‌శాఖలపై చర్చించారు. హౌసింగ్ ఎఇ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 385 పట్టాలను పంపిణీ చేయగా 204 మంది లబ్దిదారులకు పునాదుల బిల్లులు మంజూరు చేశామని తెలిపారు. అంతేకాకుండా ఇప్పటి వరకు 1600 మంది రైతులకు ఈ క్రాప్ నమోదు చేశామని వ్యవసాయాధికారులు తెలిపారు. సకాలంలో రైతులు పంట నమోదు చేసుకోవాలని సూచించారు. చీనీ, కొబ్బరి పంట సాగు చేసిన రైతులు అధికారులతో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. అనంతరం జెడ్‌పిటిసి గుద్దెళ్ల నాగరాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు నోటీసులు ఇవ్వాలని ఎంపిడిఓకు జెడ్‌పిటిసి సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశీల్దార్ నారాయణస్వామి, అడ్మినిస్ట్రేషన్ అధికారి ఆంజనేయులు, ఎస్ఐ రాజేష్, సిడిపిఓ వనజ, అక్కమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌సి, ఎస్‌టి భూ సమస్యలను పరిష్కరించండి

**-ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రామాంజి**


రామాంజి

**కంబదూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ఎస్‌సి, ఎస్‌టి భూ సమస్యలను పరిష్కరించే దిశగా కంబదూరు మండల రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ కమిటీ ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రామాంజి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పందనలో ఎస్‌సి, ఎస్‌టిలు విన్నవించుకున్న అర్జీలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఎస్‌సి, ఎస్‌టిలు సాగులో వున్న భూములకు రీ సర్వే ద్వారా హక్కు కల్పించాలన్నారు.

# స్మృతి వనాలకు స్థలాన్ని కేటాయించండి


వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**కంబదూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య సంగ్రామంలో స్వాతంత్ర్య కోసం తనవంతు పాత్ర పోషించి స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తింపు పొందిన కంబదూరు మండలానికి చెందిన ఓబయ్య, హిందీ నరసప్పలకు గౌరవంగా కంబదూరులో స్మృతి వనాలను ఏర్పాటు చేయడానికి తగిన స్థలం కేటాయించాలని కంబదూరు మండల ఎస్‌సి, ఎస్‌టి జెఎసి తరుపున బుధవారం తహశీల్దార్ నయాజ్‌అహ్మద్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు దాబా రమేష్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఎరుకల సంఘం మండల అధ్యక్షులు సుబ్బరాయుడు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

# విఆర్‌కు ఇద్దరు సిఐలు

**హిందూపురం టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** హిందూపురం పట్టణంలోని ఒకటవ పట్టణ సిఐ ఈరన్న, హిందూపురం రూరల్ సిఐ వేణుగోపాల్‌లను విఆర్‌కు బదిలీ చేస్తూ బుధవారం పోలీసుశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో హిందూపురం ఒకటవ పట్టణ సిఐగా వి.శ్రీనివాసులు, హిందూపురం రూరల్ సిఐగా శ్రీరామ శ్రీనివాసులును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా హిందూపురంలో ఒకటవ పట్టణ, హిందూపురం అప్‌గ్రేడ్, పోలీసుస్టేషన్, హిందూపురం రూరల్ సర్కిల్‌లో వున్న పేర్లు శ్రీనివాస్ కావడం విశేషం. అయితే హిందూపురం రెండవ పట్టణ సిఐగా ఉన్న శ్రీనివాసులు అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆ స్థానంలో రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు ఇంత వరకు సిఐని నియమించలేదు.

# ఆలయంలో మరోసారి చోరీ


బీరువా తులుపులు తెరిచిన దృశ్యం

**హిందూపురం టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త :** హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్ పరిధిలోని కిరికెర సూపర్ స్పిన్నింగ్ మిల్ సమీపంలో వున్న శ్రీఓంశక్తి అమ్మవారి ఆలయంలో మరోసారి చోరీ జరిగింది. ఇదే ఆలయంలో 20 రోజుల క్రితం చోరీ జరిగింది. మరోసారి బుధవారం దుండగులు చోరీకి పాల్పడ్డారు. గతంలో చోరీ జరిగిన విషయాన్ని దృష్టిలో వుంచుకుని ఆలయంలో నగదు, ఆభరణాలు వుంచలేదు. హుండీలో వున్న 5 వేల రూపాయల నగదు చోరీకి గురైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


మృతి చెందిన శివయ్య

**చిలమత్తూరు, ఆగస్టు 30 ప్రభాతవార్త :** మండలంలోని కోడూరుతోపు వద్ద లారీ ఢీ కొన్న సంఘటనలో ఆర్ఎ శివయ్య (29) అనే యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. రాయలచెరువు గ్రామం నాగలమడక హుబ్లీ పావుగడ తాలూకా చెందిన శివయ్య గోరంట్లలో జరిగిన గృహప్రవేశం కార్యక్రమానికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో బెంగుళూరుకు తన స్కూటీ మీదుగా వెళుతుండగా కోడూరుతోపు వద్ద లారీకి గుద్దడంతో శరీరంనుండి తలవేరై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఘనంగా పల్లె ఉమ వర్ధంతి వేడుకలు

**కొత్తచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులో బుధవారం మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి బాలాజీ విద్యాసంస్థల అధినేత స్వర్గీయ పల్లె ఉమ 5వ వర్ధంతి వేడుకలను తెదేపా నాయకులు కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. తొలుత ఆమె చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి కొబ్బరి కాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పల్లె ఉమ పార్టీకి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు సాలక్కగారి శ్రీనివాసులు, కన్వీనర్ రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, డిపో భాస్కర్, బండ్లపల్లి రాజు, చంద్రమోహన్, డ్రైవర్ కేశవ, శంకర, మాధవి తదితరులు పాల్గొన్నారు. కొత్తచెరువు మండలం నుండ ఇపెద్ద ఎత్తున వాహనాల్లో తెదేపా నాయకులు కార్యకర్తలు మహిళా లీడర్లు అనంతపురంలో జరిగిన పల్లె ఉమ వర్ధంతి వేడుకలకు తరలివెళ్ళారు.

# కంటి అద్దాలు పంపిణీ


వృద్దులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో డాక్టర్ వై.ఎస్.ఆర్ కంటి వెలుగు 'అవ్వ-తాత' కమ్యునిటీ ఐ స్క్రీనింగ్ క్రింద కంటి అద్దాలు పంపిణీ చేశారు. శ్రీసత్యసాయి జిల్లా అంధత్వనివారణ సంస్థ ప్రోగ్రామ్‌మేనేజర్ డా.అనూరాధ ఆదేశాల మేరకు ఆప్తామిలక్ అధికారులు బషీర్ అహ్మద్, అనిల్‌కుమార్‌ల ఆధ్వర్యంలో కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో 60 సంవత్సరాల వయస్సు పైబడిన వృద్దులకు కంటి పరీక్షలు నిర్వహించి 280 మందికి అద్దాలు పంపిణీ చేయాల్సి ఉండగా, బుధవారం 187 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందని, త్వరలోనే మిగిలిన వారికి కూడా కంటిఅద్దాలు పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. కాగా వైఎస్ఆర్ కంటి వెలుగు పథకం క్రింద ఉచితంగా ప్రభుత్వం కంటి అద్దాలు పంపిణీ చేయడం పట్ల గ్రామస్తులు, లబ్ధిదారులు హర్షం వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి (సిహెచ్ఓ) రుక్సాన, ఎఎన్ఎం శకుంతలమ్మ, ఆశావర్కర్లు నాగమణి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ యువకుడు మృతి

**కొత్తచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మండల పరిధిలోని మైలేపల్లి గ్రామ సమీపంలో మంగళవారం సాయంత్రంజరిగిన 407 వాహనం ద్విచక్ర వాహనం ను ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలపాలైన నాగార్జున (30)మృతి చెందాడు. చెన్నేకొత్తపల్లి మండలం, ఒంటి కొండ గ్రామానికి చెందిన కోలు నాగార్జున బుధవారం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలియజేశారు.

# ఖడ్గంతో యువకుడు వీరంగం...

**కొత్తచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని నాలుగు రోడ్లకూడలిలో ఓ యువకుడు ఖడ్గంతో వీరంగం ఆడిన సంఘటన విస్మయం కలిగించింది. వివరాల ప్రకారం నాలుగురోడ్ల కూడలిలోని ఓ పేయింట్ దుకాణంలో పని చేస్తున్న ఇరువులు పని వాళ్ళ మధ్య జరుగిన చిన్నపాటి గొడవ గోరంత కొండంతగా మారింది. దీంతో వారిలోని ఒక యువకుడు తన సోదరునితో కలిసి ఒక ఖడ్గం, పిడిబాకుతో ప్రత్యర్థి వ్యక్తిపై సవాలు విసురుతూ వీరంగం సృష్టించాడు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టినట్లు తెలుస్తున్నది.

# నేడు చెరువుకట్ట సుంకలమ్మదేవి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం

**- ఆలయ ముఖ ద్వారం నిర్మాణానికి జరుగనున్న భూమిపూజ**


సుంకమ్మ అమ్మవారి మూలవిరాట్

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** పట్టణంలోని చాబాల రోడ్డులోగల చెరువుకట్ట సుంకలమ్మ అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సరం శ్రావణశుద్ధపౌర్ణమిగురువారం ఉదయం జరుగనుంది. పట్టణానికి చెందిన బొమ్మిశెట్టి నగేష్‌బాబు, లావణ్య, బొమ్మిశెట్టి మురళి, స్వప్న దంపతులు దివంగతులైె బొమ్మిశెట్టి నారాయణ స్వామి, బొమ్మిశెట్టి లక్ష్మిదేవిల జ్ఞాపకార్థం ధ్వజస్తంభాన్ని సమకూర్చారు. ఉదయం 6 గంటల నుండి 8 గంటల మధ్య యంత్ర, ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవం జరుగనుండగా అనంతరం ప్రధాన రోడ్డులో అమ్మవారి ఆలయ ముఖద్వారం నిర్మాణానికి శాస్త్రోక్తంగా భూమిపూజ కొనసాగనుంది. ఈ సందర్భంగా సుంకలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగనుండగా మధ్యాన్నం భక్తులకు అన్నప్రసాద వితరణ కొనసాగనుంది.

# పలు అంశాలపై చర్చించి వ్యాయామ ఉపాధ్యాయులు

**కొత్తచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం పుట్టపర్తి నియోజకవర్గం స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం పుట్టపర్తి నియజోకవర్గ ఇన్‌చార్జ్ కె.వెంకటేశు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విద్యాశాఖ అధికారి కార్యాలయం నుండి ఎడి-2రామకృష్ణ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యాయామ ఉపాధ్యాయుల జాబ్ చార్ట్ గురించి చర్చించారు. కేలో ఇండియా. ఫిట్నెస్ అసెస్‌మెంట్‌గురి ంచి చర్చించారు. ఎస్‌జిఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) గురించి ఇయర్ ప్లాన్ లెసన్ ప్లాన్ గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి నియోజకవర్గంలో కెజిబివి మహిళా పిఇటిలు, పిఇటిలు, పిడిలు పాల్గొన్నారు.

# రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ గారూ.... మా వేతనాలలో కోతలు తగునా...

**- ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆవేదనలు**


రూరల్ సిఐతో తమ గోడుపై మొరపెట్టుకుంటున్న కసాపురం దేవస్థానం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు.

**గుంతకల్లు, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామివారి దేవస్థానంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల పట్ల చిత్తశుద్ధి లేమిగా ప్రభుత్వ నిభంధనల అతిక్రమణగా వేతనాల చెల్లింపులలో సక్రమంగా నెలసరిగా చెల్లింపులలో జాప్యం చేస్తూ కోతల విధింపు చర్యలకు పాల్పడుతున్న తీరుపై తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం సాయంత్రం ఆయా కార్యాలయాలలో ఓవైపు దేవస్థానం ఇఓకు, మరోవైపు రూరల్ సిఐకు వినతిపత్రాలను అందచేశారు. స్థానిక కసాపురం పోలీస్‌స్టేషన్ వద్ద పలువురు భాధితులైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ప్రభాతవార్తకు తెలిపిన వివరాల మేరకు... ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా దాదాపు 30యేళ్ల నుండి 20యేళ్లకు పైగా దేవస్థానంలో ఒప్పంద కార్మికులుగా విధులను నిర్వహిస్తున్నామన్నారు. కాగా దేవస్థానంలో సెక్యూరిటీ ఉద్యోగం చేస్తూ గత దాదాపు 10యేళ్లకు పైగా హనుమాన్ సెక్యురిటీ కార్యాలయం పేరుతో దేవస్థానంలో ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ హక్కులను పొందిన వైనంలో అతని వద్ద 64మంది ఉద్యోగులుగా దేవస్థానంలో విధుల ను నిర్వహిస్తున్నామన్నారు. ఈక్రమంలో దేవస్థానంలో అతను మరో కొత్త కంపెనీ నిర్వహణగా పవన్ సెక్యురిటీ కార్యాలయం పేరుతో యేడాదికి ఓ మారు పేరు మార్పుగా దేవస్థానంలో కాంట్రాక్ట్ పొందటం ఆనవాయితీగా మారిందన్నారు. ఈక్రమంలో దేవాదాయశాఖ అనుమతులు లేకుండా మరో కొందరిని ఉద్యోగులుగా అవకాశం కల్పిస్తూనే ప్రస్తుతం 71మందితో సదరు కంపెనీ ఏజెన్సీల పేరు మార్పుగా తమను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా విధుల నిర్వహణతో తమకు చట్ట నిభంధనల చర్యలైన పిఎఫ్ సక్రమంగా కట్టకుండా ఉండటమే కాకుండా ఇఎస్ఐ కార్డు గుర్తింపును కాంట్రాక్టర్‌ను అడిగితే ఒక్కొక్కరి నుండి వేలాది రూపాయలను డిమాండ్ చేస్తున్నారన్నారు. ఓవైపు తమ కనీస వేతనాల చెల్లింపులో కోతలుగా అనుమతులు పొందని వారికి వేతనాలు చెల్లింపు చర్యలు చేపట్టారన్నారు. ఈ విషయంలో దేవాదా యశాఖ అధికారులు ఇటీవల దేవస్థానంలో తనిఖీలు చేపట్టడంతో వేతనాల విషయంలో జరుగుతున్న వైనంపై దేవస్థానం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ తమ అనుమతులు లేమిగా వారికి వేతనాల చెల్లింపులు ఎలా చేస్తారని ప్రశ్నిస్తూ నిలదీసి అదనంగా చెల్లించిన వేతనాలను రికవరీ చేయాలని ఆదేశించారన్నారు. కాని వారి ఆదేశాలను భేఖాతరు చేస్తూ అధికారులు తమ వేతనాలలో కోతలు విధింపు చర్యలకు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కు రాజకీయం చేస్తుండటం తగునా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈక్రమంలోనే తమకు మూడు మాసాలుగా వేతనాలు అందించకుండా జాప్యం చేస్తున్న తీరులో తమ కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ జీవనం దుర్భరమైందన్నారు. ఓవైపు కాంట్రాక్టర్ దౌర్జన్యాల తీరుండగా అతనికి బాసటగా అధికారులు వత్తాసు పలుకుతూ తమ జీవనంను ప్రశ్నార్థకంగా మారుస్తుండటం దయనీయంగా ఉందన్న సత్యాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ అధికారులు గుర్తించి న్యాయం చేయాలని దేవస్థానం అధికారులకు, కాంట్రాక్టర్ దౌర్జన్యంను అరికట్టి తమకు అండగా నిలవాలని కోరుతూ పోలీసులను ఆశ్రయించామన్నారు.

# రైల్వే కాంట్రాక్టర్‌పై దాడి చేసిన ఓ రైల్వేఉద్యోగితో పాటు సోదరుడు


వైద్యచికిత్సలు పొందుతున్న క్షతగాత్రుడు రైల్వే కాంట్రాక్టర్ పి.వెంకటేశ్వరరావు.

**గుంతకల్లు, ఆగస్టు 30 ప్రభాతవార్త :** గుంతకల్లు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం ఓ రైల్వేఉద్యోగితో పాటు ఆయన సోదరుడు మూకుమ్మడిగా ఓ రైల్వే కాంట్రాక్టర్ గుత్తికి చెందిన పి.వెంకటేశ్వరరావుపై దాడికి పాల్పడి చితకబాదిన సంఘటన చోటుచేసుకుంది. సదరు సంఘటనలో గాయపడిన కాంట్రాక్టర్‌ను అతని మిత్రబృందం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షతగాత్రుడు తెలిపిన వివరాల మేరకు... గుంతకల్లు రైల్వేలోని ఆపరేటింగ్ శాఖలో సీనియర్ క్లర్క్‌గా విధులను నిర్వహిస్తున్న మధుతో స్నేహం ఉందన్నారు. అతని సోదరుడు లక్ష్మీనారాయణ నిరుద్యోగిగా ఉండటంతో జీవనోపాధి కల్పించి సహకరించాలని తనను కోరాడన్నారు. కాగా తాను చెన్నై రైల్వే లోకోషెడ్‌లో స్వీపింగ్ వర్క్ కాంట్రాక్ట్ ఒప్పందం టెండర్‌ను పొంది ఉండటంతో సదరు పనుల నిర్వహణ భాధ్యతలను చట్టపరమైన చర్యలతో స్నేహంకు ప్రాధాన్యతగా లక్ష్మీనారాయణకు అప్పగించానన్నారు. కాని అతను సదరు కాంట్రాక్ట్ విధుల పట్ల చిత్తశుద్ధి లేమిగా పనుల నిర్వహణ భాధ్యతలకు గైర్హాజరు కావడం జరిగిందన్నారు. దీంతో తన కాంట్రాక్ట్ టెండర్ పట్ల విధులను సక్రమంగా నిర్వహించలేదని రైల్వేశాఖ అధికారులు తనపై చట్టపరమైన చర్యలుగా ఏ ఇతర రైల్వే టెండర్లలో పాల్గొనకుండా అర్హతలను బ్లాక్ లీస్ట్‌లో పెట్టారన్నారు. దీంతో తాను దిక్కుతోచని స్థితిలో తన తప్పిదం పట్ల రైల్వే కార్యాలయం వద్ద అధికారుల తో సమీక్షించాలని వేడుకునేందుకు ఉపక్రమించడం జరుగుతోందన్నారు. ఈక్రమంలో తాను గుంతకల్లు రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఉన్నట్లు సమాచా రంతో మధుతో పాటు అతని సోదరుడు లక్ష్మీనారాయణలు మూకుమ్మడిగా చెప్పులతో దాడికి పాల్పడి ఇష్టారాజ్యంగా చితకబాదారన్నారు. దీంతో కిందపడి గాయపడిన తనను గుర్తించిన తన సహచర మిత్ర బృందం ఆటోలో గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యచికిత్సల నిమిత్తం తరలించారన్నారు. సదరు సంఘటనపై క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# బళ్లారి జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడిగా పేరం వివేక్

**బళ్లారి, ఆగస్టు30, ప్రభాతవార్త ;** బళ్లారి నగర జిల్లా కాంగ్రెస్ సమితి(డీసీసీ) ఉపాధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు, బళ్లారి నగరపాలికె 20వ వార్డు కార్పొరేటర్ పేరం వివేక్ ఎన్నికయ్యారు. అఖండ బళ్లారి జిల్లా యువ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి, జిల్లా ఉపాధ్యక్షుడిగా, బళ్లారి కంటోన్మెంట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఆరు సంవత్సరాలపాటు కాంగ్రెస్ పార్టీ సంఘటిత పరచడంలో శ్రమించిన పేరం వివేక్ పార్టీలో క్రమశిక్షణ, ప్రామాణికతతో ఉత్తమ నాయకుడిగా ఎదిగిన నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం గుర్తించి పేరం వివేక్‌కు డీసీసీ ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు కేపీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్, పేరం వివేక్‌ను నియమించినట్లు ప్రకటనలో తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని, కార్యకర్తలందరినీ ఒకేతాటిపై తీసుకొచ్చి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని పేరంవివేక్ తెలిపారు.

# వైభవంగా గోపాలకృష్ణుని గ్రామోత్సవం

**- పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు-నేడు విగ్రహ ప్రతిష్టాపనోత్సవం**


గోపాలకృష్ణుని గ్రామోత్సవం దృశ్యం


గోపాలకృష్ణుని మూలవిరాట్

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** స్వస్తిశ్రీ శోభకృత్‌నామ సంవత్సర ం శ్రావణ శుద్ధ చతుర్ధశి బుధవారం పట్టణంలో గోపాలకృష్ణుని గ్రామెత్సవం వైభవంగా జరిగింది. అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారికి పక్కన నూతనంగా నిర్మించిన మందిరంలో మహాగణపతి సహిత గోపాలకృష్ణ విగ్రహ, ధ్వజ, శిఖర కలశ ప్రతిష్టాపన మహోత్సవాలు ఈనెల 29వ తేదీ నుండి మోదలైన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం ఉదయం స్థానిక ఆలయంవద్ద నుండి ప్రత్యేకంగా ముస్తాబు చేసిన ట్రాక్టర్‌లో ఆలయంలో నూతనంగా ప్రతిష్టించనున్న గోపాలకృష్ణుని మూలవిరాట్‌ను కొలువుదీర్చి ప్రత్యేక పూజల అనంతరం డప్పు వాయిద్యాల నడుమ దారి పొడవునా బాణా సంచా పేల్చుతూ పట్టణ ప్రధాన రహదారుల గుండా గ్రామోత్సవం వైభవంగా కొనసాగింది. గురువారం (నేడు) ఉదయం మహాగణపతి గోపాలకృష్ణ విగ్రహ, ధ్వజ, శిఖర కలశ ప్రతిష్టాపన కొనసాగనుంది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయపార్టీల ప్రముఖులు తరలిరానున్నారు.

# రాతిదూలం లాడుగు పోటీల విజేత గార్లదిన్నె రామాంజినేయులు వృషభాలు

**- రూ.30వేల నగదు బహుమతి అందించిన నర్రావుల రంగనాథ్**

**- మోపిడిలో ఉత్సాహంగా, ఉల్లాసంగా రాతిదూలం లాగుడు పోటీలు**


మొదటి స్థానంలో నిలిచిన వృషభాల యజమాని రామాంజినేయులుకు నగదు బహుమతి అందిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు వృషభాలు రాతిదూలం లాగుడు పోటీల్లో విజేతగా నిలిచాయి. మండల పరిధిలోని మోపిడి గ్రామంలో సంజప్పతాత బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం మధ్యాన్నం రాతిదూలాన్ని ఎద్దులు లాగుడు పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా, ఉల్లాసంగా కొనసాగాయి. గార్లదిన్నెకు చెందిన రామాంజినేయులు వృషభాలు నిర్ణీత 20 నిమిషాల వ్యవధిలో 828 అడుగులు దూలాన్ని లాగి మోదటి స్థానంలో నిలువగా నర్రావుల రంగనాథ్ వృషభాల యజమానికు 30వేల రూపాయలు నగదు బహుమతి అందించారు. తోపుదుర్తికు చెందిన తోపుదుర్తి శ్రీరాములు వృషభాలు 801 అడుగులు దూలాన్ని లాగి ద్వితీయ స్థానంలో నిలువగా దినేష్ 20వేల రూపాయలను, తోపుదుర్తికు చెందిన చెన్నయ్య వృషభాలు 518 అడుగులు దూలాన్ని లాగి తృతీయ స్థానంలో నిలువగా ఆలయ కమిటీ ద్వారా 10వేల రూపాయల నగదు బహుమతులను అందజేశారు. ఆద్యంతం ఉత్కంఠభరితంగా చూపరుల కేరింతల నడుమ పోటీలు కొనసాగగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఎస్ఐ టి.పి.వెంకటస్వామి బృందం బందోబస్తు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు సురేష్, గోవిందు, అంగడి ఎర్రిస్వామి, రాజ్‌కుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.85 కోట్ల వ్యయంతో వెలిగొండ బీటీ నిర్మాణం

**- రోడ్డు పనుల పరిశీలనలో వైస్ ఎంపీపీ యం.నరసింహులు**


వెలిగొండ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మండల వైస్ ఎంపీపీ యం.నరసింహులు, వైసీపీ నాయకులు

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** ఉరవకొండ నుండి వెలిగొండ గ్రామానికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 1.85 కోట్ల రూపాయల వ్యయంతో బీటీ (తారు) రోడ్డు నిర్మాణం శరవేగంగా జరుగుతోందని మండల పరిషత్ ఉపాధ్యక్షులు యం.నరసింహులు అన్నారు. బుధవారం ఉదయం ఆయన మాజీ జడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, వైసీపీ నాయకులు వద్దే ఆంజినేయులుతో కలిసి రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఉపాధ్యక్షులు యం.నరసింహులు విలేఖరులతో మాట్లాడుతూ వెలిగొండ రోడ్డు గత కొన్ని సంవత్సరాలుగా మరమ్మతులులేక ఛిద్రంకాగా రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారన్నారు. దీంతో విషయాన్ని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన నిధులు మంజూరు చేయించారన్నారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా జరిగేలా ఆయన పర్యవేక్షిస్తున్నారన్నారు. త్వరలోనే రోడ్డు పనులు పూర్తీఅయి వెలిగొండ ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయని వివరించారు.

# డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంవద్ద నిరసన

**- కార్డ్ ప్రైమ్ 2.0వల్ల జీవనోపాధి ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన**


ఉరవకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న డాక్యుమెంటు రైటర్లు, వెండర్లు

**ఉరవకొండ, ఆగస్టు 30 ప్రభాతవార్త :** రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశపెట్టబోతున్న కార్డ్ ప్రైమ్ 2.0 (కంప్యూటర్ పెయిడెడ్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్) సాఫ్ట్‌వేర్‌వల్ల వేలాది మంది డాక్యుమెంటు రైటర్లు, డి.టి.పి ఆపరేటన్లు, స్టాంపు వెండర్లు వారి సహాయకుల జీవనోపాధి దెబ్బతింటుదంటూ డాక్యుమెంటు రైటర్లు, స్టాప్ వెండర్లు పెన్‌డౌన్ చేపట్టి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ముందు బుధవారం ఉదయం ప్లకార్డులు చేతబట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డాక్యుమెంటు రైటర్లు, వెండర్లు మాట్లాడుతూ పెన్‌డౌన్ రెండు రోజులు గురువారం కూడా కొనసాగుతుందన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రజలకు ఇకపై ఆన్‌లైన్‌లోనే డాక్యుమెంటును రెడీ చేసుకొని చలాలా కట్టొచ్చన్నారు. ఒక టైం స్లాట్‌ను బుక్ చేసుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లేదా గ్రామ, వార్డు సచివాలయానికి వెళ్తే రిజిస్ట్రేషన్ పూర్తీ అవుతుందన్నారు. ఈ విధానం అమలులోకి వస్తే రిజిస్ట్రేషన్లపై ఆధారపడి జీవిస్తున్న డాక్యుమెంటు రైటర్లు, వెండర్లు, డి.టి.పి ఆపరేటర్లు జీవనోపాధి కోల్పోయి వారి కుటుంబాలు ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఈ విధానాన్ని ప్రవేశ పెట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. నిరసన అనంతరం స్థానిక సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.

## మహిళలకు అండగా సీఎం జగన్

- నగర మేయర్ మహ్మద్ వసీం



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త**

రాష్ట్రంలో మహిళలకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని నగర మేయర్ మహ్మద్ వసీం పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యక్రమం వద్ద మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆహా క్యాంటీన్‌ను బుధవారం నగర మేయర్ మహ్మద్ వసీం డిప్యూటీ మేయర్ కొగటం విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్‌భాగ్యలోఖ్యలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ వసీం మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పట్టణాల్లో మహిళలను స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించేందుకు మెప్మా కృషి చేస్తోందని, ప్రభుత్వం సైతం వారికి అండగా నిలిచి ఆర్థిక సాయం అందిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే విజయవంతమైన జగనన్న మహిళా మార్టులు, అర్బన్ మార్టుల తరహాలో మహిళలకు ఆహా క్యాంటీన్‌ల ద్వారా మహిళ్శా సంఘాల సభ్యులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. తక్కువ ధరకు రుచి, శుచితో ఆహారం విక్రయాలు చేస్తుండటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలోమెప్మా పిడి విజయలక్ష్మి, కార్పోరేటర్లు కమల్ భూషణ్, వైసీపీ నాయకులు రవి, రామాంజి, శీనా, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, టిఎం శ్రీనివాస్‌రెడ్డితోపాటు మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైమ్ కార్డ్ పై దస్తావేజు లేఖరుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న దస్తావేజు లేఖరులు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

రిజిస్ట్రేషన్ శాఖ రూపొందించిన ప్రైమ్ కార్డు 2.0పై ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దస్తావేజు లేఖరులు నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజులపాటు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. బుధ, గురువారాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు చె ప్పారు. దస్తావేజులేఖరులు, స్టాంప్ వెండర్లు పొట్ట కొట్టే విధంగా ఈ నిర్ణయం ఉందని ప్రభుత్వం ఈ విధానాన్ని తక్షణం రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబాలు ఆర్థికంగా దెబ్బ తినడంతోపాటు, ప్రజల ఆస్తులకు సంబంధించి అభద్రతాభావం ఏర్పడే అవకాశం కూడా ఉందని దస్తావేజు లేఖరులు తెలిపారు. రిజిస్ట్రేషన్ వ్యవహారాలు డిజిటల్ సంతకాలలో సాగుతుందని తద్వారా డిజిటల్ సంతకం ఎక్కడైనా పొరపాటున చోరీకి గురైతే వారికి ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. బుధవారం దస్తావేజు లేఖరుల పెన్‌డౌన్‌తో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయాల వద్ద నినాదాలు చేశారు.

## ఎన్‌పిసిఐ యాక్టివేషన్ చేయించుకోండి

**శింగనమల, ఆగస్టు 30 ప్రభాతవార్త**



నిర్మలాకుమారి

మండల వ్యాప్తంగా ఉపాధిహామీ కూలీలు జాబ్‌కార్డుకు ఆధార్, బ్యాంకు ఖాతాకు ఎన్‌పిసిఐ యాక్టివేషన్ అనుసంధానం తప్పనిసరిగా చేసుకోవాలని ఎంపిడిఓ నిర్మలాకుమారి తెలిపారు. బుధవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ జాబ్‌కార్డు, ఆధార్, బ్యాంకు ఈ మూడు లింక్ అయితేనే సెప్టెంబర్ 1వ తేది నుంచి పూర్తి స్థాయిలో ఆధార్ అనుసంధానం చేసిన కూలీల బ్యాంకు అకౌంట్లకు మాత్రమే వేతన చెల్లింపులు జరుగుతాయి. ఆకులేడు-6, చక్రాయిపేట-95, గుమ్మేపల్లి-16, జులా కలువ-15, కల్లుమడి-17, కొరివిపల్లి-26, లోలూరు-5, నాగలగుడ్డం తాండా-20, నాయినవారిపల్లి-13, నిదనవాడ-30, పి.మట్లగొంది-22, పెరవలి-43, రాచేపల్లి-31, సలకం చెరువు-18, శింగనమల-58, సోదనపల్లి-39, తరిమెల-31, ఉల్లికల్లు-17, వెస్ట్ న ర్సాపురం-36, మొత్తం మండల వ్యాప్తంగా ఎన్‌పిసిఐ ఇనాక్టివ్ అకౌంట్లు 538 ఉన్నాయని, వెంటనే వారు అనుసంధానం చేయించుకోవాలని ఆమె పేర్కొన్నారు.

## ఏపిటిఎఫ్ నూతన మండల కమిటీ ఎన్నిక

**శింగనమల, ఆగస్టు 30 ప్రభాతవార్త**



ఎ.శ్రీనివాసమూర్తి



రామమూర్తి

ఏపిటిఎఫ్ నూతన మండల శాఖ ఎన్నిక బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సి కార్యాలయంలో నిర్వహించారు. గౌరవాధ్యక్షులుగా రాజేంద్ర కుమార్ మండల అధ్యక్షులుగా ఎ.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రామమూర్తి, జిల్లా కార్యదర్శి లుగా కె.సూర్యనారాయణ ఎస్‌జిటి మట్ల గొంది. బి.రాందాస్, ఫక్రుద్దీన్, వన్నూరప్ప, డి.బాబు, ఎల్ సత్యవతి, వైస్ ప్రెసిడెంట్ కె.రమేష్ (ఆనందరావుపేట), నీలవేణి (జులాకాలువ), సాంబశివుడు (గుమ్మేపల్లి), బి అనురాధ పెరవలి, జి.నాగ భూషణం తరిమెల, జాయింట్ సెక్రెటరీలు బాలసుబ్రహ్మణ్యం సిమట్లగొంది, ఎం.శ్రీనివాసులు ఆనందరావుపేట, పుష్పలత అలంకరాయునిపేట, విజయ్‌కుమార్ ఉల్లికల్లు, సుధాకర్ సలకం చెరువు, బి.సుజాత కల్లుమడి, ఎగ్జిక్యూటివ్ బాడీ హేమలత కొరివిపల్లి, సమిద సలకం చెరువు, బాలనల్లప్ప నాయినవారిపల్లి, ఉషారాణి నిదనవాడ, ఆడిటర్లు మల్లికార్జునరెడ్డి పి.మట్లగొంది, సి.కుళ్లాయప్ప జులాకాలువ, ఎస్‌ఫర్వానా పెరవలి, ప్రతిపాదించిన వారు ఎం.సత్యవతి నాగలగుడ్డం తాండా, ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నరసింహరాజు పాల్గొన్నారు.

## జగన్‌మోహన్‌రెడ్డిను గద్దె దింపేందుకు విద్యార్థులు సిద్ధం కావాలి




మాట్లాడుతున్న పి.నారాయణస్వామి

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలో నీలం రాజశేఖర్‌రెడ్డి భవనంలో బుధవారం నాడు ఏఐఎస్ఎఫ్ అనంతపురం జిల్లా కార్యవర్గ సమావేశ: ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.రమణయ్య అధ్యక్షతన నిర్వహించుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య ఆహ్వానితులుగా ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు పి.నారాయణ స్వామి పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా పి.నారాయణస్వామి మాట్లాడుతూ.. సిపిఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దేశాన్ని కాపాడండి రాష్ట్రాన్ని రక్షించండి అనే నినాదంతో జరుగుతున్న బస్సు యాత్ర అనంతపురం నగరంలో నాలుగో తేదీ సాయంత్రం జరిగే భారీ బహిరంగ సభకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయి స్వామి జిల్లా ఆఫీస్ బేరర్స్ ఆనంద్‌కుమార్ వెంకట్‌నాయక్, అంజనేయులు, నరసింహ యాదవ్, వంశీకృష్ణ సాయి స్వరూప జిల్లా కార్యవర్గ సభ్యులు వినోద్‌కుమార్, చందు హరికృష్ణ, గణేష్, విశ్వనాథ్ అభిలెనిస్, హరుణ్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు సర్వేపల్లి

-డిప్యూటి మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి



మొక్కలు నాటుతున్న దృశ్యం

**అనంతపురం ఓల్డ్‌టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

చిరస్మరణీయుడు సర్వేపల్లి రాధాకృష్ణ అని డిప్యూటి మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ట్స్ కళాశాలలో భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వారోత్సవాలను ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటి మేయర్ కోగటం వియజభాస్కర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో జాతి నిర్మాణం గురువుతోనే సాధ్యపడుతుందన్నారు. గురువు లేని జీవితం అంధకారమని విద్యార్థి దశలో వున్న శిలను శిల్పంగా మార్చేది గురువేనన్నారు. గురువు బావి తరాలకు బంగారుబాట వేస్తారన్నారు. ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ సర్వపల్లి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ వరికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిగా గుర్తించి దేశమంతా గురువుని గౌరవించే పండుగలా జరుపుకోవడం అభినందనీయమన్నారు. గురువులను స్మరించుకుంటూ గురుపూజోత్సవం నిర్వహించడం అభినందననీయమని సర్వేపల్లి రాధాకృష్ణ ఇదే కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయడం మా కళాశాలకు మరింత వన్నెతెచ్చిందని ఆయన జీవితం అందరికి ఆదర్శనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు పతికి రమేష్ నారాయణ, సంస్థ వ్యవస్థాపకులు సుంకర రమేష్, నెహ్రూ యువ కేంద్ర ప్రోగ్రాం ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, సామాజిక సేవాకర్త విజయసాయికుమార్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు షేక్‌రియాజుద్దీన్, శ్రీదేవి, ఆర్ట్స్ కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ శశాంక్, మౌళి, కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు విష్ణుప్రియ, సోమశేఖర్, ఉపాధ్యాయ బృందం, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నందిత, గౌతమ్, ఆజాం, తుకారం, రాజు, సంస్థ కార్యదర్శులు స్వప్న, కీర్తి, అలేఖ్య, బాలాజీ, కరుణ, నూర్జహాన్ పాల్గొన్నారు.

## వర్క్‌చార్జ్ సిబ్బందికి జీతాన్ని మంజూరు చేయండి



వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

**అనంతపురం ఓల్డ్‌టౌన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

రహదారులు, భవనాల శాఖలో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, రామచంద్ర, గ్యాంగ్ మజ్దూర్ ఎర్రి నాగమ్మ, ఉద్యోగులు రెండు నెలల జీతాన్ని మంజూరు చేయాలని రహదారులు భవనాల అనంతరం డివిజన్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌ను ఆంధ్రప్రదేశ్ వర్క్‌చార్జ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కలందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం నగరంలోని అనంతపురం డివిజన్ కార్యాలయంలో ఇఇని కలిసి వినతిపత్రం అందచేశారు.

## మా నోట్లో మట్టికొట్టిన అధికారులు

- పశువుల మార్కెట్ కోసమని మా భూములు తీసుకుని ప్రైవేట్ డెయిరికి ఇచ్చారు



మాట్లాడుతున్న రైతులు

**రాప్తాడు, ఆగస్టు 30 ప్రభాతవార్త**

తెలుగుదేశం ప్రభుత్వ హయాం 2016లో మా భూములు తీసుకుని పసువుల మార్కెట్ ఏర్పాటు చేస్తామంటే ఏదో ప్రజలకు ఉపయోగపడుతుందని అను కున్నాం. అప్పటి మంత్రి పరిటాల సునీత కలిస్తే మీకు ఆధారం చూపుతామని చెప్పారు. అప్పుడే నష్ట పరిహారం ఇస్తామిన అందరితో సంతకాలు పెట్టించుకుని పాసుబుక్కులు కూడా తీసుకున్నారు. ఆరోజు నుంచి ఈ రోజు దాకా పైసా కూడా మాకు నష్టపరిహారం ఇవ్వలేదు. తీరా ఇప్పుడేమో ఆ భూములను గాయిత్రి డెయిరీకి అప్పగించిన అధికారులు మా నోట్లో మట్టి కొట్టారని రాప్తాడుకు చెందిన పలువురు రైతులు వాపోయారు. బుధవారం రాప్తాడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు రైతులు మాట్లాడారు. పూజారి ఓబులయ్య, పూజారి పెద్దన్న తదితర 24 మంది రైతులకు రాప్తాడు చెరువు కట్టకు ఆనుకుని జాతీయ రహదారి పక్కనే 11.73 ఎకరాల భూమికి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో పట్టాలిచ్చారు. అప్పటి నుంచి వారు సాగు చేసుకుంటూ వస్తున్నారు. గత ప్రభుత్వంలో అక్కడ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేస్తున్నామంటూ అందరికీ నష్ట పరిహారం ఇప్పిస్తామని పట్టా బుక్కులు ఇప్పించుకుని సంతకాలు చేయించు కున్నారు. ఇప్పుడేమో ఆ భూమిని గాయత్రి డెయిరీకి అప్పగించారని రైతులు వాపోతున్నారు. సాగు చేసేందుకు భూమిలోకి పోతే పోలీసులతో బలవంతంగా బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మా భూములు మాకు ఇప్పిస్తే సాగు చేసుకుంటామని కోరుతున్నారు.

## మహిళలకు అండగా వైకాపా ప్రభుత్వం

**శింగనమల, ఆగస్టు 30 ప్రభాతవార్త**



రవికుమార్ నాయక్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తూ వారికి అండగా ఉన్నారని, వైకాపా ఎస్టీ సెల్ జిల్లాప్రధాన కార్యదర్శి రవికుమార్‌నాయక్ పేర్కొన్నారు. ఆయన బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఉద్యోగ అవకాశాలు రాజకీయంగా, సంక్షేమ పథకాలలో అన్ని అంశాలలో మహిళలకు అధిక ప్రాధాన్యత కల్పించింది ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి అని, గిరిజన మహిళలకు రాయలసీమ మైదాన ప్రాంతంలో అధిక ప్రాధాన్యత ఇస్తూ వారికి విద్య, వైద్య పరంగా అండగా ఉంటున్నాడని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్షాబంధన్ సందర్భంగా వైఎస్ఆర్ సిపి ఎస్టీ సెల్ తరపున ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్రప్రభుత్వ విద్యా సలహాదారులు ఆలూరు సాంబశివారెడ్డికి ఆయన రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఉపాధి పనులను పరిశీలించిన పార్లమెంటరీ కమిటీ సభ్యులు





ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త బ్యూరో**

కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీరాజ్‌శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు తమిళనాడు రాష్ట్రంలోని దిండిగల్ జిల్లా పరిసర ప్రాంతాల్లో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి, పంచాయితీ రాజ్ శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సభ్యులు అనంతపురం ఎంపి తలారి రంగయ్య, కమిటీ సభ్యుల బృందం పాల్గొన్నారు.

## మోడీజీ ఉద్యోగాలు ఎక్కడ : సిపిఎం నేతలు



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నేతలు

**అనంతపురం అర్బన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**

నరేంద్ర మోదీ 2014 సంవత్సరం అధికారంలోకి రాకముందు సంవత్సరానికి రెండు కోట్ల మందికి నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని ఉపన్యాసాలు దంచి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్కరికీ కూడా ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు లేకుండా చేశారని సిపిఎం పార్టీ ఒకటవ నగర కార్యదర్శి రామిరెడ్డి విమర్శించారు. బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పాతూరు ఐదు లైట్ల సర్కిల్, బ్రహ్మంగారి గుడి, మార్కెట్‌యార్డు దాకా అలాగే తపోవనం సర్కిల్, నారాయణపురంలో సమరభేరి కార్యక్రమంలో నగర కార్యదర్శి మాట్లాడుతూ.. ధరల పెరుగుదలను అరికట్టడంలో, నిరుద్యోగ సమస్యలు పరిష్కరించడంలో, కరెంటు చార్జీలను తగ్గించడంలోనూ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఎన్నికలు దగ్గరకు వస్తున్నాయని చెప్పి ప్రజల్లో వ్యతిరేకత ఉందని తెలిసి గ్యాస్ ధరను 1170 నుంచి 200 రూపాయలు తగ్గించి అది కదూఆ వారి ఘన కార్యంగా చెప్పుకోవడం బిజెపికి సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర నాయకులు ప్రకాష్‌మసూద్, బాబు, ఎర్రి స్వామి, నాగభూషణం, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, రాజు, గఫూర్, జీవ, ఎన్టీఆర్ శీన, తపోవనం రాజు, నవయుగ కాలనీ వన్నూరప్ప, రవి, నారాయణ, పెన్నోబిళేసు, పీరా, శివరుద్ర, షరీఫ్, ఆటో విశ్వ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యను తీర్చిన ఆలూరి రమణరెడ్డి

**బుక్కరాయసముద్రం ఆగస్టు 30 ప్రభాతవార్త**



వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఆలూరి రమణరెడ్డి

బుక్కరాయసముద్రం మండల పరిదిలోని శిద్దరాంపురం గ్రామంలో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుచున్నారు గ్రామంలో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను చెడిపోయి నిరుపయోగంగ ఉండడంతో సర్పంచు కొండన్న వైసిపి మండల ఇన్‌చార్జి ఆలూరి రమణరెడ్డి దృష్టికి తీసుకపోవడంతో ఆయన సొంత ఖర్చులతో దాదాపు లక్ష రూపాయలతో మరమత్తు చేయించి గ్రామ ప్రజల దాహరిని తీర్చారు. ఈ కార్యక్రమంలో ఆలూరి రమణరెడ్డి తోపాటు జడ్పిటీసీ నీలం భాస్కర్, జెసిఎస్ మండల కన్వీరన్ పసులూరు బయపరెడ్డి, వైస్ ఎంపీపీ 2 సాకే లక్ష్మినారాయణ, కాలవ నారాయణస్వామి, పురుషోత్తం, తదితిరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**ఆత్మకూరు ఆగస్టు 31 ప్రభాతవార్త**



గోడపత్రికలను విడుదల చేస్తున్న భారత చైతన్య యోజన పార్టీ నాయకులు

భారత చైతన్య యోజన పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2,3, తేదిలలో జరిగే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని భారత చైతన్య యోజన పార్టీ నాయకులు బీసీ సురేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు కేంద్రంలో గోడ పత్రికలను విడుదల చేశారు. అనంతరం సురేష్‌యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ఈ క్రమంలో భారత చైతన్య యోజన పార్టీ ఆధ్వర్యంలో 2,3,తేదిలలో విజయవాడలో మంగళగిరి డీజీపి ఆఫీస్ ఎదురుగా హాపీ రిసార్ట్స్‌లో 500 కంపెనీలతో 50 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని భారత చైతన్య యోజన పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్ సంకల్పిస్తున్నారని, కావున జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజు, నాగరాజు, శ్రీధర్, సమీర్, భాష, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

## సాకే వీరాకు రాఖీ కట్టిన మాజీ మంత్రి పరిటాల సునీత

**అనంతపురం రూరల్, ఆగస్టు30 ప్రభాతవార్త**



సాకే వీరాకు రాఖీ కట్టిన పరిటాల సునీత

టిడిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాకే వీరాంజినేయులకు మాజీ మంత్రి పరిటాల సునీత రాఖీ కట్టీ అక్క తమ్ముల అనుబంధాని సాగు కున్నారు. ఈ సందర్భంగా సాకే వీరాంజినేయులు మాట్లాడుతూ మాజీ మంత్రి పరిటాల సునీత అక్క రాఖీ పండుగ సందర్భంగా నన్ను తమ్ముడిగా బావించి నాకు రాఖీ కట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ రోజును నేను జీవితంలో మర్చిపోలేని రోజుగా గుర్తు ఉంచుకుని మధురమైనా జ్ఞాపకంగా ఉంచుకోవడం జరుగుతుందన్నారు. నేను ఎన్నోసార్లు సునీత అక్కతో రాఖీ కట్టించుకోవాలని అనుకోవడం జరిగిందని నా కళ నేటితో నేరవేరిందన్నారు.

## నిరుపేదల ఆశాజ్యోతి పరిటాల రవీంద్ర

**అనంతపురంరూరల్,ఆగస్టు30ప్రభాతవార్త:**



పరిటాల రవీంద్ర చిత్రపట్టానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిరుపేదల ఆశాజ్యోతి టిడిపి రాష్ట్ర మాజీ మంత్రి దివంగతనేత పరిటాలరవీంద్రనేని యాదవ సాధికార సమితి అధ్యక్షులు బిల్లా నాగరాజు, టిడిపి నాయకులు మెటి కల రామృష్ణ, పూత్తా ఎర్రి స్వామి, వెంకటరాముడు పేర్కో న్నారు. బుధ వారం టిడిపి నాయ కుల ఆధ్వర్యంలో పరిటాలరవీంద్ర 66జయంతి కార్యక్రమాన్ని అభిమానులు, ప్రజలు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి పరిటాల రవీంద్ర చిత్రపట్టానికి పూలమాలలువేసి నివాళులర్పించి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రల్లోని ఎస్సీ, ఎస్టీ, బిసి, ముస్లీం, మైనార్టీ వర్గాల ఆశాజ్యోతి పరిటాల రవీంద్రనేన్నారు. పెనుకొండ, ధర్మవరం నియోజకవర్గాలోని పేదప్రజలు అభివృద్దిలోకివచ్చారంటే అది పరిటాల కుటుంబం చలువేన్నారు.

## మేయర్ వసీంను కలిసి స్టాండింగ్ కమిటీ సభ్యులు



వసీంతో మాట్లాడుతున్న స్టాండింగ్ కమిటీ సభ్యులు

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త**

నగర మేయర్ మహ్మద్ వసీంను నూతనంగా ఎంపిక అయిన స్టాండింగ్ కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మేయర్ వసీంకు పుష్పగుచ్ఛం అందించి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులుగా తమకు అవకాశం కల్పించినందు కృతజ్ఞతలు తెలిపారు. స్టాండింగ్ కౌన్సిల్ ఆధ్వర్యంలో తీసుకునే నిర్ణయాల్లో వారికి అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూతన స్టాండింగ్ కమిటీ సభ్యులు అభూసాలెహ్, శేఖర్‌బాబు, లీలావతి, సంపంగి రామాంజినేయులు, రాజేశ్వరి, నగరపాలక కార్యదర్శి సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు.

## పంచాయితీలో చేసిన అభివృద్ధి పనులకు మాత్రమే బిల్లు చెల్లిస్తున్నాం

- ఎక్కడ ఏలాంటీ పోరపాటు జరగకుండా ముందుకు వెళ్ళుతున్నాం,
- అభివృద్ధిని అడ్డుకోవడమే ఉప సర్పంచ్ పనిగా పెటుకున్నారు
- వార్డు సభ్యుల సమావేశంలో సర్పంచ్ సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్.
- పనులు పూర్తి అయిన వాటికే బిల్లు పెడుతున్నాం, కార్యదర్శి నరసింహరెడ్డి.



వార్డు సభ్యులకు చేసిన పనుల వివరాలను తెలుపుతున్న పంచాయితీ కార్యదర్శి నరసింహరెడ్డి

**అనంతపురం రూరల్,ఆగస్టు30ప్రభాతవార్త**

అనంత రూరల్ మండలం రుద్రంపేట పంచాయితీలో చేసిన అభివృద్ధి పనులకు మాత్రమే బిల్లు చెల్లిస్తు ఎక్కడ ఏలాంటీ పోరపాటు జరగకుండా పంచాయితీని అభివృద్దిలో ముందుకు తీసుకపోవడం జరుగుతుందని కావున ప్రతి ఒక్కవార్డు సభ్యులు భాగస్వాములై అభివృద్దికి కలిసి రావాలని సర్పంచ్ సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్, రుద్రంపేట పంచాయితీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టినప్పటీనుంచి నేటీ వరకు ఎక్కడ అవినీతి, అక్రమాలకు చోటులేకుండా చర్యలు తీసుకుంటు పనులు పూర్తి అయిన వాటీకే బిల్లులు పెట్టడం జరుగుతుందని పంచాయితీ కార్యదర్శి నరసింహరెడ్డి తెలిపారు. బుధ వారం రుద్రంపేట గ్రామ పంచాయితీలో సర్పంచ్ సుగాలి పద్మావతి ఆదినారా యణ నాయక్ అధ్యక్షతన కార్యదర్శి నరసింహరెడ్డి గ్రామ వార్డు సభ్యుల సమా వేశం నిర్వహించి పంచాయితీలో ఎక్కడ ఎక్కడా ఏమి పనులు జగిగాయో సభ్య లందరికి చదివి వినిపించాడు. వార్డులో ఏమి సమస్యలు ఉన్నాయో సభ్యులను అడిగి తెలుసుకుని వాటీ పరిష్కరానికి తీరుమానం చేశారు. అనంత సర్పంచ్ సుగాలి పద్మావతి ఆదినారాయణ నాయక్ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సహాయ సహకారాలతో పంచాయితీని అభివృద్ధి బాటలో నడిపించడం జరుగుతుందన్నారు. అదే విధంగా వార్డు సభ్యులు మీ వార్డులలో ఏమైన సమస్యలు ఉన్న వాటీని మా దృష్టికి తీసుకవస్తే వాటీని ఎమ్మెల్యే దృష్టికి తీసుకపోయి వాటి పరిష్కరానికి కృషి చేస్తాన్నారు. మేము పంచాయితీ అభివృద్ధి కోసం పాటు పడుతుంటే ఉప సర్పంచ్ నరేంద్రరెడ్డి మాత్రం అభివృద్దిని అడ్డు కోవడమే పనిగా పెట్టుకుని ప్రతి పనిని అడ్డుపడడం జరుగుతుందన్నారు. పంచాయితీని మరింత అభివృద్ధి బాటలో నడిపించడం కోసం ప్రతి ఒక్క వార్డు సభ్యులు భాగస్వాములై కలిసి నడవాలన్నారు. అనంతరం పంచాయితీలో గల ప్రైవేట్ వ్యక్తు ట్రాక్టర్లులను తీసివేసి పంచాయితీ నిధులతో నూతన ట్రాక్టర్లను కోనుగోల్ చేయాలని తీర్మాణం చేశారు. పంచాయితీలో చేసిన పనులను సభ్య లందరు పరిశీలించి వాటీని అమోదించిన తరువాతనే బిల్లు మంజూరు చేయాలని కార్యదర్శిని సభ్యులు కోరడంతో సభ్యులందరు పరిశీలించి అమోదించిన తరు వాతనే వాటీకి సంబందించిన బిల్లు పెడతామని నరసింహరెడ్డి తెలిపారు.

## మెరుగైన విద్యనందిస్తూ సేవా గుణాన్ని పెంపొందిస్తున్నాం

- ప్రిన్సిఫల్ సుభద్రమ్మ, ఎన్ఎస్ఎస్ పిఓ నారాయణరెడ్డి వెల్లడి

**పామిడి, ఆగస్టు 30 ప్రభాతవార్త**




కళాశాలలలో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వాలంటరీలు

విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూనే వారిలో సేవ గుణాన్ని పెంపొందిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిఫల్ సుభద్రమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, మరుగుదొడ్డి చుట్టూ ఉన్నటువంటి ముళ్ళకంపలు, రాళ్ళను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేసి పచ్చదనాన్ని పెంపొందించే క్రమంలో మెక్కలు, చెట్లకు నీటిని పట్టారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిఫల్ సుభద్రమ్మ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు మెరుగైన విద్యనందిస్తూ వారంతా తమ లక్ష్యాన్ని సాధించేందుకు తర్ఫీదును ఇస్తున్నామని తెలిపారు. విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యశిస్తూ ఉన్నత శిఖరాలకు చేరుకుని సేవా దృక్పధాన్ని అలవర్చుకుంటూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని సమాజాభివృద్దికి పాటుపడాలని ఈపద్యంలో సామాజిక బాద్యతలను విస్మరించరాదని సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల అద్యాపకులు రఫీ, రామకృష్ణ, రాజ్యలక్ష్మి, రాములు, గోపి, ఎన్‌సిసి వాలంటరీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి



ఈశ్వరయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏడిసిసి బ్యాంకు మాజీ చైర్మెన్ పామిడి వీరజ

**పామిడి, ఆగస్టు 30 ప్రభాతవార్త**

వ్యవసాయ పొలం నందు బోర్‌వెల్ పనులు చేస్తుండగా విధ్యుదాఘాతం సంబవించి ఒకరు మృతి చెందగా మరోముగ్గురు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండల పరిదిలోని నేమళ్ళపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. సంఘటనకు సంబందించి స్థానికులు అందించిన వివరాలిలావున్నాయి.. పెద్దవడుగూరు మండల మిడుతూరుకు చెందిన ఈశ్వరయ్య, వంకరాజుకాల్వకు చెందిన ఇద్దరు, ఎదురూరుకు చెందిన ఒకరు నేమళ్ళపల్లి వ్యవసాయ పొలం నందు బోర్‌లోనికి పైపులు దింపుతుండగా పైనున్న విద్యుత్‌వైరు తగిలి ప్రమాదం సంబవించి ఈశ్వరయ్య అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోస్టుమార్టం నిమిత్తం ఈశ్వరయ్య మృతదేహాన్ని ప్రభుత్వా సుపత్రికి తరలించి తీవ్రంగా గాయపడ్డ ముగ్గురికి చికిత్సను అందజేస్తున్నారు. జరిగిన సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు. విషయం తెలుసుకున్న ఏడిసిసి బ్యాంకు మాజీ చైర్మెన్ పామిడి వీరాంజనేయులు ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఈశ్వరయ్య మృతదేహాన్ని సందర్శించి మృతుని కటుంబ సభ్యులను పరామర్శిస్తూ తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## మృతుని కుటుంబానికి వైఎస్ఆర్ భీమా

**పామిడి, ఆగస్టు 30 ప్రభాతవార్త**



మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న దృశ్యం

గ్రామపంచాయతీ పరిదిలోని పి.కొండాపురం సచివాలయంలో రామకృష్ణ మృతి చెందగా గుంతకల్లు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయన కుటుంబానికి వైఎస్ఆర్ భీమా పథకం తక్షణ సహాయం కింద రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని బుధవారం మెప్మా టిఎంసీ చంద్రశేఖర్, వైసీపీ 1వ వార్డు ఇన్‌చార్జ్ మునగల రంగనాయకులు అందజేశారు. వైఎస్ఆర్ భీమా పథకంలో సభ్యులు కావటంతో మృతుని కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 వేలను అందించటం జరిగిందని త్వరలోనే ప్రభుత్వం నుండి రూ.90 వేల ఆర్థిక సహాయం నామిని అయిన మృతుని బార్య సుంకరత్నబ్యాంకు ఖాతాలో జమ అవుతుందని తెలియజేశారు. వైఎస్ఆర్ భీమా పథకంలో ఇన్సూరెన్స్ చెల్లించటం ద్వార ఎలాంటి ప్రమాదం జరిగినా ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం వస్తుందన్నారు. రామకృష్ణ భీమా ఇన్సూరెన్స్‌ను చెల్లించటం ద్వార ఆయన కుటుంబానికి ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం అందుతుందని వారు వెల్లడించారు ఈకార్యక్రమంలో సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి పద్మావతి, వార్డు వాలంటరీ కోటేశ్వర్‌రావు, గృహసారధి హేమావతి, వైసీపీ నాయకులు కుళ్ళాయప్ప, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

04ATP13_04ATP13.qxd 30-08-2023 PM 11:12 Page 1



## ప్రజా శ్రేయస్సు కోసం శ్రమించిన వ్యక్తి పరిటాల రవి

### - పరిటాల రవి జయంతి వేడుకలలో టిడిపి సీనియర్ నేత పిజెఆర్


అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త బ్యూరో**
ప్రజల సమస్యలపై ప్రజల కోసం శ్రమించిన వ్యక్తి తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అని గుంతకల్లు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్‌నాయకులు, పిజెఆర్ ట్రస్టు వ్యయస్థాపకులు పెరుమాళ్ల జీవానందరెడ్డి పేర్కొన్నారు. గుత్తి పట్టణం ప్రభుత్వ ఆసుపత్రిలో పరిటాల రవి 66వ జయంతి సందర్భంగా యాచకులకు,రోగులకు వారి సహాయకులకు పెరుమాళ్ల జీవానందరెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జీవానందరెడ్డి చేతుల మీదుగా అన్న సేవాకార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ప్రజా శ్రేయస్సు కోసం ప్రజల సమస్యలపై పోరాడి ప్రజలకు సహాయ సహకారాలు అందించిన వ్యక్తి తెలుగుదేశం పార్టీ మాజీ మంత్రి పరిటాల రవీంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు. పరిటాల శ్రీరామ్ చేతులు మీదుగా కేక్ కట్ చేసి పరిటాల రవికి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్‌నాయుడు, కరిడికొండ సూరి, తెలుగు యువత మండల అధ్యక్షులు సుధాకర్‌నాయుడు, జైపాల్‌రెడ్డి, నాగిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, హనుమంతరెడ్డి, శ్రీరాములు, మున్న చాంద్‌బాషా, సుంకరరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్దేహాళ్‌లో ఆక్రమణల తొలగింపు

### - మార్కింగ్ ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని కొందరు అడ్డగింపు


దగ్గరుండి తొలగిస్తున్న పోలీసులు


ఎందుకు తొలగిస్తున్నారని బాధితులు

**బొమ్మనహాళ్, ఆగస్టు 30 ప్రభాతవార్త**
మండలంలోని ఉద్దేహాల్ గ్రామంలో భారీ పోలీసు బందోబస్తు నడుమ ఆక్రమణలు తొలగించారు. పోలీస్,రెవెన్యూ, గ్రామ పంచాయితీ అధికారుల ఆధ్వర్యంలో గ్రామంలో జెసిబితో ఆక్రమణలు తొలగించారు. 2017లో హైకోర్టు ఉత్తరాల మేరకు ఆక్రమాలలో తొలగింపుకు ఆదేశాలు ఇవ్వడంతో బుధవారం తహశీల్దారు శ్రీనివాసులు, ఈఓఆర్డి విజయమ్మ, పంచాయితీ కార్యదర్శి శివన్న, విఆర్‌ఓ యుగంధర్‌లు భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలో ఉన్న బంకులు, భవనాలను తొలగించారు. రాయదుర్గం పట్టణం, రాయదుర్గంరూరల్, కళ్యాణదుర్గం సిఐలు లక్ష్మణ, యుగంధర్, శ్రీనివాసులు, గుమ్మఘట్ట, డీ హీరేహాల్, బొమ్మనహాళ్ ఎస్సైలు రంగడు, శివ, ఏఎస్ఐ రమణ హెడ్‌కానిస్టేబుళ్లతోపాటు భారీ స్పెషల్ పార్టీ ఫోర్సుతో బంధోబస్తు నడుమ ఆక్రమణలు తొలగించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఆక్రమణాలను తొలగించారు. 2017లో 10 మందిని మీనాక్షి కురుబ రామప్ప, కురుబ రుద్రన్న, రాజేంద్రరావు, పెద్ద ఎర్రిస్వామి, ఛత్రపతినాయక్, కురుబ చంద్రశేఖర్, కురుబ నాగేంద్ర, రోజావతి ఆక్రమణాలను సర్వే చేసి తొలగించేందుకు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినట్లు విజయమ్మ తెలిపారు. ఛత్రపతి, పెద్దే ఎర్రిస్వామి మావి ఆక్రమణాలో ఉన్నట్లు సర్వే చేయకుండా ఎక్కడ వరకు తొలగిస్తున్నారని వాదనలకు దిగారు. మావి రికార్డులు చూడాలని సర్వే నెంబర్ రాంగ్ ఉందని సర్వే చేయకుండా వెళ్లిపోయారని ఇప్పుడు ఎలా తొలగిస్తారని అడ్డుపడ్డారు. అవేమీ లెక్క చేయకుండా గ్రామ కంట ప్రకారం ఆక్రమణలో ఉన్నట్లు తొలగిస్తున్నామని జెసిబిలతో వారు రూములను తొలగించేశారు. ఇదిలా ఉండగా రోజావతి, వెంకటేషులు రెవెన్యూ అధికారులే ఓటిఎస్ రిజిస్ట్రేషన్ చేయించారని, కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్లు ఇచ్చిందని తొలగించ వద్దని అడ్డు తగిలారు. పోలీసులు వారిని అడ్డుకుని జెసిబిలతో వెంకటేష్‌కు చెందిన బాత్రూంలను తొలగించారు. కోర్టులో మాకు అనుకూలంగా ఉత్తర్వులు ఉన్న అవేవీ అధికారులు పట్టించుకోకుండా దౌర్జన్యంగా మా భవనాలను తొలగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

## అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలి


సచివాలయ సిబ్బందితో పాట్లాడుతున్న ఎమ్మెల్యే

**కదిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త**
అర్హత కలిగిన లబ్దిదారులకు సంక్షేమ పథకాలు అందే విధంగా సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే డా.పివి.సిద్దారెడ్డి తెలిపారు. బుధవారం గాండ్లపెంట మండల పరిధిలోని వేపరాళ్ల సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలెంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన సాంకేతికతతో మణిపాల్ ఆసుపత్రిలో వెన్నెముఖ మెదడు శస్త్ర చికిత్సలు


మాట్లాడుతున్న మనిపాల్ ఆసుపత్రి డాక్టర్లు

**అనంతపురం, ఆగస్టు 30 ప్రభాతవార్త బ్యూరో**
బెంగుళూరు కేంద్రంగా వైద్య సేవలు అందిస్తున్న ప్రఖ్యాత మణిపాల్ ఆసుపత్రిలో అత్యాధునిక సాంకేతిక త కూడా వెన్నుముఖ మెదడు శస్త్ర చికిత్సలను నిర్వహిస్తున్నామని, ఆ సదరు ఆసుపత్రికి వైద్యులు డాక్టర్ అజయ్‌కుమార్, శరత్‌రాజమణిలుతెలిపారు. ఈ సందర్భంగా వారు ప్రభాతవార్తతో మాట్లాడుతూ.. మనిషి శరీరంలో కీలకమైన మెదడు వెన్నెముఖలలో ఎదుర్కొనే వివిధ రకాల సమస్యలకు మణిపాల్ ఆసుపత్రిలో అత్యాధునికమైన కేంద్రపరికరాలతో శస్త్రచికిత్సలు విజయవంతంగా తక్కువఖర్చుతో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మెదడుకు నిర్వహించేసరికి చాలా ప్రధానంగా మినీ మల్లి ఇన్వాసి టెక్నాలజీని వినియోగిస్తున్నామని దీని ద్వారా పుర్రెకు అతి చిన్న రంధ్రాన్ని చేసి మెదడులోని రక్త కణాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పడిన సమస్యలను న్యూరో నావిగేషన్ ప్రిక్రియ ద్వారా సమస్య ఖచ్చితత్వాన్ని గుర్తించి శస్త్రచికిత్స నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. దక్షిణ భారతదేశంలోనే మొట్టమొదటి సారిగా మణిపాల్ ఆసుపత్రిలో త్వరలో రోబోటిక్ సర్జరీని ప్రవేశ పెడుతున్నామని తెలిపారు.

## ఆరోగ్యకరమైన ఓటరు జాబితా తయారు

### - డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి సుధారాణి


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ సుధారాణి

**శింగనమల, ఆగస్టు 30 ప్రభాతవార్త**
ఆరోగ్య కరమైన ఓటరు జాబితా తయారు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల అధికారి సుధారాణి పేర్కొన్నారు. ఆమె బుధవారం మండల కేంద్రంలోని తహశీల్దారు కార్యాలయంలో ఆరు మండలాల ఎన్నికల అధికారులు, అఖిల పక్ష పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చనిపోయిన వారి ఓటరు తొలగింపు, వారి కుటుంబ సభ్యుల అనుమతి, బిఎల్‌ఏల పరస్పర అంగీకారంతోనే తొలగిస్తున్నట్లు, ఎవరైనా విభేదిస్తే వాటిని నిలుపుదల చేశామని, డబుల్ ఎంట్రీ ఉన్న వాటిని కూడా సంబంధిత బిఎల్‌ఓల విచారణతో సరి చేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు పెరవలి, నిదనవాడ, ఆనందరావు పేట గ్రామాల్లో ఒకే నెంబర్‌తో పలు ఓట్లు ఉన్న వషయాన్ని ఆమెదృష్టికి తీసుకురావడంతో వెంటనే వాటిపై విచారణ చేస్తామని ఆమె పేర్కొన్నారు. ఓటరు నమోదు కార్యక్రమం నిరంతర కార్యక్రమం అని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శింగనమల తహశీల్దారు ఈశ్వరమ్మ, ఈఓటి రామకృష్ణ, బుక్కరాయసముద్రం తహశీల్దారు, సిపిఐ నుంచి చెన్నప్ప యాదవ్, టిడిపి నుంచి ఆదినారాయణ, వైకాపా నుంచి ఎన్‌వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే


వధూవరులతో ఎమ్మెల్యే కేతిరెడ్డి

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 30 ప్రభాతవార్త**
పట్టణంలో బుధవారం జరిగిన పలు వివాహ వేడుకలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఇందులో భాగంగా రిపోర్టర్ అనిల్‌కుమార్ వివాహానికి హాజరై శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యేతో పాటు పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అనర్హత కలిగిన ఓటర్ల తొలగింపులో ఎన్నికల నిబంధనలు తప్పనిసరి

### - సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్


సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్

**శ్రీసత్యసాయి జిల్లా, ఆగస్టు 30, ప్రభాతవార్త ప్రతినిధి:**
అనర్హత కలిగిన ఓటర్ల తొలగింపు విషయంలో ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని శ్రీసత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలునందు స్పెషల్ సమ్మర్ రివిజ్-2024లో భాగంగా ఇంటింటి సర్వేపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో సంయుక్త కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 21లోపు ఇంటింటి సర్వే పూర్తి కాబడిందని, బిఎల్‌ఓలు పూర్తి స్థాయిలో ఇంటింటికి వెళ్ళి క్లైయిమ్స్ పరిశీలన చేసినట్లు తెలిపారు. క్షేస్థాయిలో ఓటుహక్కు కలిగిన వారికి పోలింగ్ కేంద్రాలు రెండు కిలో మీటర్ల పరిధిలో ఉన్నాయని, వాటిని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులు పరిశీలన చేయాలన్నారు. జిల్లాలో జనవరి 06,2022 నుండి ఆగస్టు 31,2023 వరకు విచ్చన డెత్, షిఫ్టింగ్, కేసులు అన్ని రీ వెరిఫికేషన్ చేయడం జరుగుతోందని, దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గంకు ఒక స్పెషల్ ఆఫీసర్‌నునియమించడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా అనర్హత కలిగిన ఓటర్ల తొలగింపు విషయమై ఫార్మాట్-ఎ నోటీస్ ఇచ్చి డిలీట్ చేయడం జరుగుతుందన్నారు. షిఫ్టింగ్ కేసు విషయమై బిఎల్‌ఓలు క్లారిటీగా ఉండాలని తెలియజేశామన్నారు. వీరి విచారణలో తేలిన ఓటర్ల వివరాలను ఫారం 6,7,8లను స్వీకరించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రాజకీయా పార్టీల ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సంయుక్త కలెక్టర్ సమాధానం ఇచ్చారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ, కలెక్టర్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్, వైఎస్‌ఆర్‌సిపి నాయకుడు బిఎస్‌పి, సిపిఐ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 28 చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు మంజూరు

### - సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్



సమావేశంలో మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ , హాజరైన జిల్లా, ప్రాంతీయ,మండల వ్యవసాయాధికారులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు

**పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30, ప్రబాతవార్త :** వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకంలో భాగంగా శ్రీసత్యసాయి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ కరువునివారణ పథకం క్రింద ఏర్పాటు చేసిన 7 రైతు ఉత్పత్తి దారు సంగాల సభ్యులకు 28 చిరుధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లను మంజూరుచేసినట్లు శ్రీసత్యసాయి జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్ తెలియజేశారు. ఈ మేరకు బుధవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావుతో కలసి జిల్లాలోని కనగానపల్లి, తలుపుల, తనకల్లు, రామగిరి, అగళి, రొద్దం మండకశిర మండలాల నుండి రైతు ఉత్పత్తి దారుల సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావులు మాట్లాడుతూ, ఆయా ప్రాసెసింగ్ యూనిట్లకు 50 శాతం రాయితీ, 2 లక్షలకు మించకుండా ఇస్తారని, రాయితీని లబ్ధిదారుల ఖాతాలకు నేరుగా జమచేయడం జరుగుతుందని తెలియజేశారు. ప్రస్తుతం చిరుధాన్యాలు,ముఖ్యంగా రాగి సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ అవకాశాన్ని వినియోగించుకొని రైతులు, రైతు ఉత్పత్తి దారులు సంఘాల ద్వారా ప్రయోజనం పొందాలని సంయుక్త కలెక్టర్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్, మండల స్థాయి వ్యవసాయాధికారులు, సహాయ వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హొస్పేట వరకు విస్తరించిన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రారంభం

### - బళ్లారి వరకు ఈ రైళ్లను విస్తరణ చేస్తాం...... ఎంపీ వై.దేవేంద్రప్ప


హొస్పేటలో గదగ్-ముంబాయి, సోలాపూర్-గదగ్ డెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభిస్తున్న బళ్లారి ఎంపీ వై.దేవేంద్రప్ప

**బళ్లారి, ఆగస్టు30, ప్రభాతవార్త ;**
గదగ్ వరకు సంచరిస్తున్న రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు బుధవారం నుంచి హొస్పేట వరకు విస్తరణ జరగడంతో సదరు రెండు రైళ్ల సర్వీసులను బళ్లారి ఎంపీ వై.దేవేంద్రప్ప ప్రారంభించారు. గదగ్-ముంబాయి (రైల్‌నం.11139-11140) ఎక్స్‌ప్రెస్, (11305-11306) షోలాపూర్-గదగ్-షోలాపూర్ డెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లను హొస్పేట జంక్షన్ వరకు రైళ్లశాఖ విస్తరింపజేసింది. ఈ రెండు రైళ్లను ఎంపీలు వై.దేవేంద్రప్ప, కరడి సంగన్నలు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. దీనికి ముందు జరిగిన వేదిక కార్యక్రమం ఉద్దేశాన్ని మాట్లాడిన ఆయన బళ్లారిలో జీన్స్‌పరిశ్రమ ఇప్పుడిప్పుడేఅభివృద్ధి చెందుతున్నదని, బళ్లారి నుంచి జీన్స్ దుస్తులు ఇతర ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయని, ఈ రెండు రైళ్లను బళ్లారి వరకు విస్తరణ చేస్తే జీన్స్ పరిశ్రమకు ఎంతగానో దోహద పడుతుందని చెప్పారు. బళ్లారి ప్రాంతం ప్రజలు మహారాష్ట్రకు నిరంతరం సంచారం చేస్తారని, వారికి అనుకూలంగా ఉండేలా ఈ రైళ్లను బళ్లారి వరకు విస్తరణ చేస్తే పర్యాటకంగా, పారిశ్రామికంగా, వ్యవసాయ, వ్యాపారరీత్యా వినియోగదారులకు హెచ్చు అనుకూలమవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ, రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్ ఆసక్తితో భారతీయ రైల్వే రంగంలో విప్లవాత్మకమైన మార్పులు జరుగుతున్నాయని, వందే భారత్ రైలు యోజన అభివృద్ధి పథంలో తీసుకెళ్లారని, బళ్లారిలో రూ.16.7 కోట్లతో అమృత్ భారత్ యోజన కింద బళ్లారి రైల్వే స్టేషన్ సమగ్రాభివృద్ధి జరుగుతుందని, 175 సంవత్సరాల చరిత్ర కలిగిన బళ్లారి రైల్వే స్టేషన్ అభివృద్ధి పథంవైపు అడుగులు వేస్తుందన్నారు. కొప్పళ ఎంపీ కరడి సంగన్న మాట్లాడారు.

## ఆడబిడ్డల రక్షణే ధ్యేయంగా...సంక్షేమే లక్ష్యంగా...

### - గడపగడపకు మనప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



సంక్షేమ కరదీపిక అందచేస్తున్న ఎమ్మెల్యే,విద్యార్థినిలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

**ఓబుళదేవరచెరువు, ఆగస్టు 30, ప్రభాతవార్త :**
రాష్ట్రంలోని అడబిడ్డలకు అన్నగా, తమ్ముడిగా వారి రక్షణే ధ్యేయంగా, సంక్షేమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలియచేశారు. ఓడీచెరువు సచివాలయం-1 పరిధిలోని వీధులలో బుధవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు పూలమాలలు వేసి,ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు తీరుపై ఆరా తీశారు. ఇంకా పరిష్కారంకాని సమస్యలు ఎవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారులకు తెలియచేసి వాటికి పరిష్కారం చూపించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఏ ఇంటి వద్దకు వెళ్లినా జగనన్న ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సుఖసంతోషాలతో ఆనందంగా ఉన్నారన్నారు. ప్రధానంగా మహిళా సాధికారత పెద్దపీట వేశారన్నారు. అంతే కాకుండా కుటుంబ యజమానిగా మహిళలకు అగ్ర తాంబూళం వేస్తూ వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ, అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ చేదోడు, వైఎస్సార్ నేతన్న నేస్తం, అభయ హస్తం పింఛన్, ఒంటరి మహిళ పింఛన్, అభయ హస్తం ఇన్సూరెన్స్, మహిళలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేసేందుకు ఎమ్ఎస్ఎమ్ఈ పథకం, మహిళా మార్ట్‌లు, బ్యాంకు లింకేజి రుణాలు, శ్రీనిధి రుణాలు, ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ మహిళలకు వడ్డీలేని రుణాలు, ముస్లిం సోదరీమణులకు దుల్హన్ పథకం ద్వారా రూ లక్ష, వైఎస్సార్ పెళ్లి కానుక పథకం ద్వారా బిసి మహిళలకు రూ 50 వేలు, ఎస్సీ, ఎస్టీలకు రూ లక్ష, సకాలంగులు వికలాంగులను పరిణయమాడితే రూ 1.50 లక్షలు, గర్భిణిలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.అక్కచెల్లెమ్మల అండతోనే తాము మరోసారి అధికారం చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి తుమ్మల పర్వీన్‌భాను, జడ్పిటిసి దామోదర్‌రెడ్డి, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్ణారెడ్డి, రాజునాయుడు, ఓడిసి మండలపరిశీలకులు భాస్కర్‌రెడ్డి, వ్యవసాయ సలహాదారు లక్ష్మిరెడ్డి, నల్లమాడ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ శ్రీనివాసరెడ్డి, మైనార్టీ సెల్ నాయకులు తుమ్మల షామీర్‌బాష, సర్పంచ్ గోవిందు, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు బాబ్‌జాన్, నాయకులు ప్రభాకర్‌నాయుడు, డీలర్ రమేష్, రమణారెడ్డి, మారెన్న, భైరిశెట్టి, రాజేష్‌తో పాటు అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షాబంధన్ కార్యక్రమం

### - వెంకటాపురంలో పరిటాల శ్రీరామ్‌కు రాఖీ కట్టిన తెలుగు మహిళలు

### - మహాశక్తి కార్యక్రమం ద్వారా సేకరించిన రాఖీలను చంద్రబాబుకు పంపిన తెలుగు మహిళలు



రాఖీలు కట్టించుకుంటున్న మాజీ మంత్రి పరిటాల సునీత,రాఖీలు కట్టించుకుంటున్న పరిటాల శ్రీరామ్

**రామగిరి, ఆగస్టు 30 ప్రభాతవార్త**
రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ మహిళా నేతల ఆధ్వర్యంలో రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. రామగిరి మండలం వెంకటాపురం గ్రామంలో తెలుగు మహిళలు పెద్దఎత్తున ఈకార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా రవి ఘాట్ వద్ద వారు నివాళులు అర్పించారు.అనంతరం పరిటాలశ్రీరామ్‌కు రాఖీలుకట్టిన మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్,పరిటాలసునీత ధర్మవరం,రాప్తాడు నియోజకవర్గాల్లోని మహిళలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు. రాప్తాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మహిళా నేతలు చేపట్టిన మహాశక్తి చైతన్య యాత్ర ఇప్పటిదాకా 38 పంచాయితీలో సాగిందని వివరించారు. చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు మహిళలు ప్రతి ఇంటి నుంచి పసుపు తాడు ఇచ్చారని వాటిని తమ అధినేతకు పంపుతున్నట్లు తెలిపారు. చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో మహిళలకు వరాల జల్లు కురిపించారని, దీనిపై మహిళలంతా సంతోషంగా ఉన్నారని వారు తెలిపారు. ఇప్పటికే ఈ పథకంపై పెద్ద ఎత్తున స్పందన వస్తోందన్నారు. చంద్రబాబుకు రక్షాబంధన్ సందర్భంగా నియోజకవర్గంలోని ఒకటిన్నర లక్షల మంది మహిళల అండగా ఉంటుందుని తెలియజేశారు.

## సాయినామస్మరణం పుట్టపర్తిలో గిరి ప్రదక్షిణ ఉత్సవం


సత్యసాయి గిరి ప్రదక్షిణ దృశ్యం

**పుట్టపర్తి,ఆ గస్టు 30, ప్రభాతవార్త**
సాయినామస్మరణతో పవిత్ర పుణ్యక్షేత్రం పుట్టపర్తిలో గిరి ప్రదక్షిణ ఉత్సవం ఘనంగా జరిగింది. ప్రతి పౌర్ణమి నాడు నిర్వహించే ఈ గిరి ప్రదక్షణ ఉత్సవానికి ప్రత్యేకత సంతరించుకుంది. ఆగస్టు నెలలో రెండు పౌర్ణమి దినాలు రావడం బుధవారం నాడు నీలిరంగులో ప్రకాశవంతమైన చంద్రుడు కనిపించడం అద్వితీయం. సాయినభక్తులు సత్యసాయి బాబా చిత్రపటాన్ని రథంపై ఉంచి ప్రశాంతి నిలయం గణేష్ గేటు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుండి పురవీధుల్లో ఊరేగింపుగా బయలుదేరి సత్యసాయి విద్యాగిరి విద్యాలయాలు, గోకులం ఎనుములపల్లి గణేష సర్కిల్ ప్రశాంతి పెట్రోల్‌స్టేషన్ కమ్మవారిపల్లి, చింతతోపు, పెద్ద బజార్, శివాలయం వీధి హనుమాన్ సర్కిల్ గోపురం వీధి మీదుగా 7 కిలో మీటర్ల మేర ఎద్దుల కొండ గిరులను తిరుగుతూ గిరి ప్రదక్షిణ ఉత్సవం ప్రశాంతి నిలయం ముంగిట మహామంగళ హారతితొఓ ముగించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని బాబా కృపకు పాత్రులయ్యారు.

## హెచ్ఎల్‌సికి తరచూ గండి

**మొదటిపేజి తరువాయి...** కణేకల్లు సెక్షన్ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో సుమారు 28వేల ఆయకట్టు భూములు ఉన్నాయని, ఆ భూములకు ఆరు తడి పంటలు వరి మాగాని భూములు ఉన్నాయని వీటికి సాగునీరు సకాలంలో అందక పలువురు రైతులు ఆవేదనకు గురవుతున్నారని వారు అన్నారు. మొదటి ఆయటకట్టుకే ఇంత వరకు నీరు పూర్తిగా అందలేదంటే చివరి ఆయకట్టు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందని, కాలువల మరమ్మత్తులకు మూడు రాష్ట్ర ప్రభుత్వాలుమరమ్మత్తుల నిధులు కేటాయించకపోవడం వల్ల తరచూ గండ్లు పడుతూ రోజుల తరబడి నీరు లేక పోవడం వల్ల వరి మాగాని నీరందక ఎండిపోతున్నాయని ఇలాగే కొనసాగితే పంట దిగుబడి తక్కువై రైతులు నష్టల్లో కూరుకుపోతారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వేల రూపాయలు ఖర్చు చేసి రైతు నష్టపోతే పరిస్థితి ఏంటని వారు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు ముందుకు వచ్చి హెచ్ఎల్‌సి కాలువకు మరమ్మత్తు చేసి రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పై విషయమై హెచ్ఎల్‌సి డిఈ మద్దిలేటిని వివరణ కోరగా బుధవారం సాయంత్రం సరిహద్దుకు నీరు చేరుతాయని దాటవేశారు.

## ఘనంగా పరిటాల రవి జయంతి కార్యక్రమం

**మొదటిపేజి తరువాయి...** పరిటాల ఘాట్ వద్ద పెద్ద ఎత్తున రవి జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా పరిటాల సునీత పరిటాల శ్రీరామ్‌తోపాటు ఇతర కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇక్కడ వందలాదిగా తరలివచ్చిన అభిమానులు ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. అనంతరం పరిటాల సునీత చేతుల మీదుగా అందరికీ మిఠాయిలు తినిపించారు. ఈ సందర్భంగా సునీత శ్రీరామ్ మాట్లాడుతూ.. పరిటాల రవి బ్రతికినన్ని రోజులు పేద ప్రజల కోసమే పరితపించారని గుర్తు చేసుకున్నారు. ఆయన కొందరు పెత్తందారులు, దౌర్జన్య పరులకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన తర్వాత పెనుకొండ రాప్తాడు నియోజకవర్గాల్లో అనేక సేవా కార్యక్రమాలు చేశారని అన్నారు. మంత్రిగా ఉన్న సమయంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. ముఖ్యంగా రైతులు వలసలు వెళ్లకుండా అన్ని ప్రాంతాలకు నీరు అందించాలని ఆ రోజుల్లో ఎంతో పరితపించారని సునీత అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పరిటాల కుటుంబంతోపాటు అభిమానులంతా ముందుకు నడుస్తారని ఆమె స్పష్టం చేశారు.